తెలుగు దినపత్రిక
# సిరి
People's Voice
వార్త పత్రిక
RNI TG TEL/ 26/A0381
15-04-2026
బుధవారం హైదరాబాద్
సంపుటి: (volume): 1
సంచిక: (ISSUE): 76
PUBLISHED FROM HYDERABAD
పేజీలు-8 వెల:రూ.4 /–

## న్యాయమైన డిమాండ్ లను అమలు చేయాలి

- విద్యుత్ ఆర్టిజన్ కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలి..
- ఆర్టిజన్ సమ్మెకు మాజీ డిప్యూటీ స్పీకర్ యం. పద్మ దేవేందర్ రెడ్డి మద్దతు

7



## ఆర్టికల్ 370 రద్దు తర్వాత పూర్తిగా అమల్లోకి రాజ్యాంగం

- ప్రధాని మోదీ
- ఢిల్లీ, డెహ్రాడూన్ ఎకనామిక్ కారిడార్ ప్రారంభం
- హరిద్వార్‌లో జరగనున్న కుంభమేళా సందర్భంగా ఉత్తరాఖండ్‌ను శుభ్రంగా ఉంచాలని పిలుపు

3



## 850 లోక్‌సభ స్థానాలు



డీలిమిటేషన్ కమిషన్ ఏర్పాటు
మహిళా రిజర్వేషన్ల అమలుకు కేంద్రం సిద్ధం
చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు
16న లోక్‌సభలో ప్రవేశపెట్టనున్న కేంద్రం

3



# అంబేద్కర్ ఆశయాలే ప్రభుత్వానికి మార్గదర్శకం

నియోజకవర్గాల పునర్విభజనలో బీజేపీ కుట్రలు
అంబేద్కర్ ఆలోచనలకు వ్యతిరేకంగా అడుగులు
డీలిమిటేషన్‌తో దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం



హైదరాబాద్, ఏప్రిల్ 14, సిరి న్యూస్:
రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా రాష్ట్రంలో ప్రజాపాలన కొనసాగిస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. హైదరాబాద్‌లోని లోయర్ ట్యాంక్ బండ్ వద్ద అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన అనంతరం ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహించిన అంబేద్కర్ జయంతి వేడుకల్లో పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్, సీతక్కతో పాటు పలువురు నేతలు పాల్గొన్నారు. నియోజకవర్గాల పునర్విభజన పేరుతో బీజేపీ కుట్రలకు పాల్పడుతోందని సీఎం ఆరోపించారు. డీలిమిటేషన్ ప్రక్రియ ద్వారా దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరిగేలా

మిగతా 2వ పేజీలో..

## అంబేద్కర్‌ను బందీని చేసిన కాంగ్రెస్



- తాము హెచ్చరించాకనే తాళాలు తీశారు
- గురుకులాల్లో మరణ మ దంగం
- ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్‌తో మోసం
- కాంగ్రెస్ మోసాలను ఎండగడదాం
- శ్రేణులకు బీఆర్ఎస్ నేత కేటీఆర్ పిలుపు

హైదరాబాద్, ఏప్రిల్ 14, సిరి న్యూస్:
ప్రపంచంలోనే అతిపెద్దదైన బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహాన్ని కేసీఆర్ ఆవిష్కరించారన్న దుర్బుద్ధితో కాంగ్రెస్ పార్టీ 2024 ఏప్రిల్ 14 నాడు బందీ చేసిందని, 125 అడుగుల ఎత్తులో ఆ మహానుభావుణ్ణి సంకెళ్లలో పెట్టి ఎవరినీ దర్శించుకోనీయకుండా చేసిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. 2025లో

మిగతా 2వ పేజీలో..

## బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో దోపిడీనే

కవిత ప్రశ్నలకు సమాధానం చెప్పి తీరాలి
కేటీఆర్ పాదయాత్రలు చేసినా ప్రజలు నమ్మరు
కాంగ్రెస్ కమిటీ బాధ్యతల స్వీకారంలో పీసీసీ చీఫ్



3

## నిప్పులు కుమ్మరించినట్టు రాష్ట్రంలో మండుతున్న ఎండలు



- ఉదయం 9 గంటల నుంచే భానుడి భగభగలు
- రాష్ట్రంలో 42 డిగ్రీలకు పైగా నమోదవుతున్న గరిష్ఠ ఉష్ణోగ్రతలు

3

## అంబేద్కర్ అందరి వాడు

ఓ వర్గానికి ఆపాదించుకునే కుట్ర జరుగుతోంది
తడకపల్లిలో అంబేద్కర్ విగ్రహావిష్కరణలో హరీష్‌రావు

సిద్దిపేట, ఏప్రిల్ 14, సిరి న్యూస్:
సిద్దిపేట అర్బన్ మండలం తడకపల్లిలో అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు చేయడం చాలా సంతోషంగా ఉందని, ఎన్నో ఎళ్లుగా ఉన్న లోటు నేటితో తీరిపోయిందని సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్‌రావు


మిగతా 2వ పేజీలో..



## జీవన్‌రెడ్డికి మర్యాద తగ్గించలేదు

పరిస్థితులను పంచుకునేందుకే మీతో సమావేశం
జగిత్యాల ముఖ్య నేతలతో రేవంత్ భేటీ
మేమంతా కాంగ్రెస్‌లోనే కొనసాగుతాం
స్పష్టం చేసిన నాయకులు

3



# ప్రతిపక్షంలో హామీ అధికారంలోకి వచ్చాక నిధుల లేమి

### ప్రభుత్వ ద్వంద్వ విధానంపై పెరుగుతున్న అసంతృప్తి

విద్యుత్ శాఖలో దీర్ఘకాల సమ్మెతో ఉద్రిక్త పరిస్థితి
ఆర్టీసీ విలీనం డిమాండ్‌పై కార్మికుల పోరాటం
కార్మిక సంఘాలతో చర్చలకు ముందుకు రాని ప్రభుత్వం
ఫిరాయించిన ఎమ్మెల్యేలలో పెరుగుతున్న అసంతృప్తి
కలకలం సృష్టించిన ప్రభుత్వ సలహాదారుడి వ్యాఖ్యలు




2



## సమ్మె యోచన విరమించండి

- చర్చలకు మా తలుపులు తెరిచే ఉన్నాయి
- ఆర్టీసీ కార్మికులకు మంత్రి పొన్నం వినతి

హైదరాబాద్, ఏప్రిల్ 14, సిరి న్యూస్:
ఆర్టీసీ పరిరక్షణ – ప్రజల ప్రయోజనాల దృష్ట్యా సమ్మె నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని రోడ్డు రవాణా సంస్థ కార్మికులకు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్ మంగళవారం మాట్లాడుతూ ఆర్టీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. చర్చల ద్వారా సమస్యలు పరిష్కరించుకుందామని కార్మికులకు పిలుపునిచ్చారు. సమస్యలు

మిగతా 2వ పేజీలో..

## ఇంకా అజ్ఞాతంలో నలుగురు మావోయిస్టులు

- గణపతి, సంతోష్, రత్నాబాయి, వార్త శేఖర్
- తెలంగాణ పోలీస్ శాఖ వెల్లడి

2

## రాష్ట్రంలో మావోయిస్టుల ప్రభావం లేదు

- వీఐపీల సెక్యూరిటీ విడతల వారీగా తగ్గిస్తాం: డీజీపీ శివధర్‌రెడ్డి



3



# అంబేడ్కర్ అందరి వాడు

**మొదటిపేజీ తరువాయి**

అన్నారు. ఇచ్చిన మాట ప్రకారం సాయి, ఆయన కుమారుడు గ్రామంలో అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేసినందుకు వారిని అభినందిస్తున్నానంటూ గ్రామం మొదట్లోనే విగ్రహం ఏర్పాటు చేయడం చాలా సంతోషంగా ఉందని, ఎవరు గ్రామానికి వచ్చినా మొదట ఆహ్వానం పలికేది అంబేడ్కరేనని, ఆయన జయంతి రోజున విగ్రహాన్ని ఆవిష్కరించడం సంతోషదాయకమని అన్నారు. కొంతమంది అనుకున్నట్లు అంబేడ్కర్ ఒక వర్గానికి మాత్రమే నాయకుడు కాదని, ఆయన అందరివాడని, కొంతమంది కావాలనే ఒక వర్గానికి ఆపాదించే కుట్ర చేస్తున్నారని అన్నారు. ఇవాళ భారత దేశం ప్రపంచంలో అదిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా ఎదుగుతునదంటే అది అంబేడ్కర్ రచించిన రాజ్యాంగమే కారణమన్నారు. అమెరికా వంటి దేశంలోనే మహిళలకు ఓటు హక్కు రావాలంటే దశాబ్దాల కాలం పట్టింది.. కానీ మన దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన వెంటనే రాజ్యాంగం ద్వారా ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించిన గొప్ప వ్యక్తి బాబా సాహెబ్ అంబేడ్కర్ అని హరీష్‌రావు తెలిపారు. నేటి యువత ఆయనను స్ఫూర్తిగా తీసుకోవాలని హితవు పలికారు. పేదరికం చదువుకు అడ్డు కాదని అంబేడ్కర్‌ని చూసి నేర్చుకోవాలన్నారు. దేశంలోని అణగారిన వర్గాల కోసం పోరాడి విజయం సాధించిన మహోన్నత వ్యక్తి అని కొనియాడారు. అలాంటి గొప్ప వ్యక్తి ఆశయాలను రాష్ట్రంలో ముందుకు తీసుకుపోవాల్సిన కాంగ్రెస్ ప్రభుత్వం అలవికాని హామీలు ఇచ్చి గద్దెనెక్కి నేడు ఏమీ చేయలేక చేతులు ముడుచుకుని కూర్చుందని విమర్శించారు. 10వ తరగతి పాస్ అయితే రూ.10 వేలు, ఇంటర్ పాస్ అయితే రూ.25 వేలు, డిగ్రీ పాస్ అయితే రూ.లక్ష, పీజీ పాస్ అయితే రూ.2 లక్షలు ఇస్తామని ఎన్నికలపుడు కాంగ్రెస్ నాయకులు చెప్పి ఎస్సీ, ఎస్టీ విద్యార్థులను నమ్మించి మోసం చేశారని విమర్శించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయకపోవడంతో సర్టిఫికెట్లు రాక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్న పరిస్థితులు చూస్తున్నామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన ఈ రెండున్నరేళ్లల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులకు రూపాయి కూడా ఇవ్వలేదన్నారు. ఆనాడు కేసీఆర్ ఒక్కో విద్యార్థికి రూ.20 లక్షలు ఇచ్చి విదేశాల్లో చదివించారన్నారు. దేశంలో 28 రాష్ట్రాలు ఉంటే సచివాలయానికి అంబేడ్కర్ పేరు పెట్టిన ఒకే ఒక్క నాయకుడు కేసీఆర్ అని గుర్తు చేశారు. హైదరాబాద్ నడిబొడ్డున భారీ అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తే ఇది కేసీఆర్ పెట్టించిందు అని రేవంత్ రెడ్డి అక్కడ గేట్లకు తాళం వేయించాడని, కనీసం అంబేడ్కర్ కు దండ కూడా వేయని సంకుచిత మనస్తత్వం ఉన్న వ్యక్తి రేవంత్ రెడ్డి అని ఎద్దేవా చేశారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం దళిత బంధు అమలు చేయాలని హరీష్‌రావు డిమాండ్ చేశారు.



## ఇంకా అజ్ఞాతంలో
# నలుగురు మావోయిస్టులు

- **గణపతి, సంతోష్, రత్నాబాయి, వార్త శేఖర్**
- **తెలంగాణ పోలీస్ శాఖ వెల్లడి**

**హైదరాబాద్, ఏప్రిల్ 14, సిరి న్యూస్:**

తెలంగాణకు చెందిన నలుగురు మావోయిస్టులు మాత్రమే ఇంకా అజ్ఞాతంలో ఉన్నారని రాష్ట్ర పోలీస్ శాఖ వెల్లడించింది. కేంద్ర కమిటీ సభ్యుడు ముప్పాళ్ల లక్ష్మణ రావు అలియస్ గణపతి, పసునూరి అలియాస్ నరహరి అలియాస్ సంతోష్, స్టేట్ కమిటీ సభ్యులు జడే రత్నాబాయి అలియాస్ సుజాత, వార్త శేఖర్ అలియాస్ మంగు ఉన్నారని పోలీస్ శాఖ వివరించింది. సాయుధ పోరాటం విరమించి జనజీవన స్రవంతిలో కలవాలంటూ ఇప్పటికే మావోయిస్టులకు డీజీపీ పిలుపు ఇచ్చిన సంగతి తెలిసిందే. తెలంగాణ ప్రభుత్వ లొంగుబాటుతోపాటు పునరావాస విధానం ద్వారా లభించే ప్రయోజనాలు పొందాలని మావోయిస్టులకు పోలీస్ శాఖ విజ్ఞప్తి చేసిన విషయం విదితమే. మరోవైపు కాంకేర్ జిల్లాలో భద్రతా బలగాల కూంబింగ్ సందర్భంగా సోమవారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఎల్ఓసీ కమాండర్ రూపీ రెడ్డి అలియాస్ రంగబోయిన భాగ్య (46) మరణించారు. సిద్ధిపేట జిల్లా మిరుదొడ్డి మండలం ధర్మారం ఆమె స్వస్థలం. రెండు దశాబ్దాలుగా ఆమె అజ్ఞాతంలో ఉంటున్నారు. మూడు రాష్ట్రాల్లో మోస్ట్ వాంటెడ్‌గా ఉన్నారు. ఆమెపై రూ.5 లక్షల రివార్డు ఉంది. ఆమె మృతదేహానికి ఇప్పటికే పోస్ట్‌మార్టం పూర్తయింది. మంగళవారం సాయంత్రం ఆమె మృతదేహం స్వగ్రామానికి చేరుకోనుంది. బుధవారం రూపీ మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించనున్నారు.

# సమ్మె యోచన విరమించండి

**మొదటిపేజీ తరువాయి**

చెప్పుకోవడానికి తమ తలుపులు తెరిచే ఉన్నాయి.. ఎవరైనా వచ్చి తమ సమస్యలు చెప్పుకోవచ్చునని కార్మికులకు సూచించారు. ఆర్టీసీ విలీనం, కార్మిక సంఘాల అంశాలు ప్రభుత్వ పరిధిలోనే ఉన్నాయన్నారు. ఆర్టీసీ విలీనానికి సంబంధించి ఏర్పాటు చేసిన కమిటీ పనిచేస్తున్నదని ఈ సందర్భంగా మంత్రి పొన్నం గుర్తు చేశారు. తమ డిమాండ్ల నెరవేరని పక్షంలో ఏప్రిల్ 22వ తేదీ నుంచి సమ్మెలోకి వెళ్తున్నట్లు ఆర్టీసీ జేఏసీ సోమవారం ప్రకటించింది. 21వ తేదీ అర్ధరాత్రి నుంచి ఆర్టీసీ బస్సులు నిలిపివేస్తామని స్పష్టం చేసింది. ఆర్టీసీ క్రాస్ రోడ్డులోని కార్మిక శాఖ కార్యాలయంలో ఆ శాఖ ఉన్నతాధికారులతో ఆర్టీసీ జేఏసీ నేతలు సోమవారం సమావేశమయ్యారు. అనంతరం ఆర్టీసీ జేఏసీ నేతలు మాట్లాడుతూ ఈ సమావేశంలో పాల్గొనేందుకు ఆర్టీసీ సంస్థ నుంచి అధికారులు రాలేదని తెలిపారు. అయితే ఆర్టీసీ యాజమాన్యం నుంచి లేఖ మాత్రం వచ్చిందన్నారు. కార్మికుల సమస్యలు ప్రభుత్వం పరిధిలో ఉన్నాయని యాజమాన్యం స్పష్టం చేసిందన్నారు. ప్రభుత్వంలో ఆర్టీసీ విలీనం, కార్మిక సంఘాలకు ఎన్నికలు సహా మరో 30 డిమాండ్లతో సమ్మెకు వెళ్తున్నట్లు జేఏసీ నేతలు ఈ సందర్భంగా ప్రకటించారు. ఈ నేపథ్యంలో రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పైవిధంగా స్పందించారు.



# అంబేడ్కర్‌ను బందీని చేసిన కాంగ్రెస్

**మొదటిపేజీ తరువాయి**

కూడా అదే అక్కసుతో మళ్ళీ బంధించి అవమానించిందన్నారు. అందుకే మొన్న విద్యార్థి విభాగం నాయకత్వంలో ఒక నిర్ణయం తీసుకున్నామని, ఒకవేళ ఈసారి కూడా బాబాసాహెబ్‌ను మళ్ళీ బందీ చేస్తే తామే వందలాదిగా వేలాదిగా వచ్చి ఆ సంకెళ్లు బద్దలు కొడతామని చేసిన హెచ్చరిక ఇవాళ ఫలించి రాష్ట్ర ప్రభుత్వం అక్కడ ఏర్పాట్లు చేసిందని వ్యాఖ్యానించారు. తెలంగాణ భవన్‌లో అంబేడ్కర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించగా ముఖ్య అతిథిగా కేటీఆర్ హాజరయ్యారు. అనంతరం తెలంగాణ భవన్ నుండి భారీ కాన్వాయ్‌తో కేటీఆర్, పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ముఖ్య నేతలు 125 అడుగుల భారీ అంబేడ్కర్ విగ్రహం వద్దకు చేరుకున్నారు. విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ ఆశయాలను స్మరించుకుంటూ పార్టీ శ్రేణులు నినాదాలు చేశారు. అనంతరం కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ అంబేడ్కర్ విగ్రహం సాక్షిగా కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగట్టారు. ప్రపంచంలోనే అతిపెద్దదైన ఈ అంబేడ్కర్ విగ్రహాన్ని మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఎంతో ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. బోధించు, సమీకరించు, పోరాడు అనే అంబేడ్కర్ మాటల స్ఫూర్తితో కేసీఆర్ లక్షలమందితో తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం పోరాడి చివరకు చావు నోట్లో తలపెట్టి రాష్ట్రాన్ని సాధించారని గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీ అంబేడ్కర్‌ని రాజకీయ అవసరాల కోసం వాడుకుందే తప్ప గౌరవించలేదని ఆయన విమర్శించారు. 1952, 1954లో ఆయన పార్లమెంటుకు రాకుండా కుట్రలు చేసి ఓడించిందన్నారు. హిందూ కోడ్ బిల్లు విషయంలో మహిళలకు హక్కులు కల్పించాలని ఆయన చూస్తే దాన్ని అడ్డుకున్నందుకు నిరసనగా ఆయన తన మంత్రి పదవికి రాజీనామా చేశారని చెప్పారు. నెహ్రూ, ఇందిర, రాజీవ్ గాంధీ కాలంలో ఆయనకు భారతరత్న ఇవ్వలేదని, కాంగ్రెసేతర ప్రభుత్వం వచ్చినప్పుడే ఆయనకు ఆ గౌరవం దక్కిందని అన్నారు.. చివరకు పార్లమెంట్ సెంట్రల్ హాల్‌లో ఆయన ఫోటో పెట్టడానికి కూడా కాంగ్రెస్ ఒప్పుకోలేదన్నారు. కేసీఆర్ ప్రభుత్వం వెయ్యి గురుకుల పాఠశాలలు ఏర్పాటు చేసి దాదాపు 6.5 లక్షల మంది పిల్లలకు, ఏడాదికి ఒక్కొక్కరిపై రూ.1.25 లక్షల చొప్పున ఖర్చు చేస్తూ ప్రపంచంతో పోటీపడే పౌరులుగా తయారు చేయాలని సంకల్పించిందన్నారు. కానీ ఇవాళ రేవంత్ రెడ్డి ప్రభుత్వం వాటిని సరిగా నిర్వహించలేకపోతోందని, గురుకులాల్లో మరణ మృదంగం మోగుతోందని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. ఆహార కల్తీ వల్ల, ఆత్మహత్యల వల్ల 130 మందికి పైగా విద్యార్థులు మరణించడం దౌర్భాగ్యమన్నారు. కేసీఆర్ దళిత బంధు కింద రూ.10 లక్షల ఇస్తే తాము రూ.12 లక్షలు ఇస్తామని చెప్పి ఆ స్కీమ్‌కు 'అంబేడ్కర్ అభయహస్తం' అని పేరు పెట్టారు కానీ దాన్ని అమలు చేయకుండా దళితులను, అంబేడ్కర్‌ను కూడా కాంగ్రెస్ ప్రభుత్వం అవమానిస్తోందన్నారు. నాడు కేసీఆర్ కంటే మించిన పథకం తెస్తామని 'అంబేడ్కర్ అభయహస్తం' అని చెప్పి చేవెళ్ళలో మల్లికార్జున ఖర్గేని పిలిచి ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్ పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని ఆరోపించారు. ఆ మూడు వర్గాలకు 'అభయ హస్తం' పేరిట మేనిఫెస్టోలో 72 శాతం ప్రభుత్వ కాంట్రాక్టులు ఇస్తామని చెప్పిందని, రెండున్నరేళ్ల పాలనలో రూ.లక్ష, లక్షన్నర కోట్ల కాంట్రాక్టులు రేవంత్ రెడ్డి పిలిచిండు అని, 72 శాతం వాటా ఇవ్వలేదని, రేపోమాపో మూసీ కాంట్రాక్టు పిలుస్తారట.. మరి ఆ కాంట్రాక్టులు ఇస్తాడా రేవంత్ రెడ్డి అని ప్రశ్నించారు. ఓవర్సీస్ స్కాలర్‌షిప్ కూడా పెంచుతా అన్న రేవంత్ రెడ్డి ఇవ్వాళ రూపాయి ఇవ్వడంలేదన్నారు.వాళ్ల విద్య మధ్యలోనే ఆగిపోయేలా అన్యాయం చేస్తున్నాడన్నారు. కాంగ్రెస్ మోసాన్ని ప్రతి గిరిజన తండాకు, ప్రతి దళిత వాడకు తెలిసేలా చేయాల్సిన బాధ్యత మన మీద ఉందన్నారు. ఏప్రిల్ 27 నాడు మన పార్టీ ఆవిర్భావ దినోత్సవం, జగిత్యాలలో బహిరంగ సభ రెండు కార్యక్రమాల తర్వాత మే, జూన్‌ల్లో ఎస్సీ, ఎస్టీల కోసం సభలు పెడదామని కేటీఆర్ పిలుపునిచ్చారు. కాంగ్రెస్ చేసిన హామీల మీద మనం పకడ్బందీగా పోరాడాలన్నారు. చేవెళ్ళ ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్‌తో పాటు బీసీ, రైతు డిక్లరేషన్లను అమలు చేసే వరకు అంబేడ్కర్ స్ఫూర్తితో తమ పోరాటం ఆగదని ఆయన స్పష్టం చేశారు. నివాళులు అర్పించిన అనంతరం కేటీఆర్, ఇతర ప్రజాప్రతినిధులు విగ్రహం కింది భాగంలో ఉన్న భవనంలోని మ్యూజియంను సందర్శించారు. అక్కడ ఏర్పాటు చేసిన అంబేడ్కర్ జీవిత విశేషాలను, చారిత్రక ఘట్టాలను ఆసక్తిగా తిలకించారు. ఈ కార్యక్రమంలో మండలిలో ప్రతిపక్ష నాయకుడు మధుసూదన చారి, మాజీ మంత్రులు తలసాని శ్రీనివాస్ యాదవ్, గంగుల కమలాకర్, ప్రశాంత్ రెడ్డి, కొప్పుల ఈశ్వర్, శ్రీనివాస్ గౌడ్, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, మాజీ ఎంపీ రావుల చంద్రశేఖర్ రెడ్డి, ఆర్.ఎస్.ప్రవీణ్ కుమార్, ఎస్సీ ఎస్టీ కమిషన్ మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్, పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



# ప్రతిపక్షంలో "హామీ "
## అధికారంలోకి వచ్చాక నిధుల "లేమి"

**ప్రత్యేక ప్రతినిధి, (సిరి న్యూస్):**

ప్రతిపక్షంలో ఉన్నప్పుడు భారీ హామీలు ఇచ్చి ప్రజల మద్దతుతో అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం, ఇప్పుడు ఆ హామీలను అమలు చేయడంలో విఫలమవుతోందా అనే ప్రశ్నలు తెలంగాణలో తీవ్రంగా వినిపిస్తున్నాయి. అప్పట్లో సమస్యలను ప్రస్తావిస్తూ ఉద్యమాలు చేసిన నాయకత్వం, ఇప్పుడు అదే సమస్యలపై మౌనం వహించడం కార్మికులు, ఉద్యోగులు, ప్రజల్లో అసంతృప్తిని రేకెత్తిస్తోంది.అటు ఉద్యోగుల పరిస్థితి ఇలా ఉంటె ఇటు అబివృద్ధి పేరిట పక్క పార్టీలనుండి చేర్చుకున్న ఎమ్మెల్యేల అసంతృప్తి ప్రభుత్వ వైఫల్యానికి అద్దంపడుతోంది .ఇప్పటికే టీఅర్ఎస్ నుండి వచ్చిన ఒక ఎమ్మెల్యే అదే పార్టీలోకి తిరిగివెళ్ళారు.మరికొందరు అదే బాటలో వెళ్ళడానికి సిద్ధంగా ఉన్నట్టు సమాచారం.దీనికి కారణం సైతం చేరేప్పుడు వారికిచ్చిన హామీలను నెరవేర్చక పోవడమే .అదేదో సామెత చెప్పినట్టు ఒడ్డు చేరేవరకు ఓడమల్లన్న అని ఒడ్డు చేరాక బోడమల్లన్న అన్నట్టుంది ప్రభుత్వ వ్యవహారం.




**విద్యుత్ శాఖలో సమ్మె.. పరిష్కారం ఎక్కడ?**

విద్యుత్ శాఖలో ఆర్టిసియన్లు తమ డిమాండ్ల సాధన కోసం దీర్ఘకాలంగా నిరసనలు చేపట్టిన తర్వాత సమ్మెకు దిగారు. క్రమబద్ధీకరణ, ఉద్యోగ భద్రత వంటి అంశాలపై స్పష్టత ఇవ్వాలని వారు కోరుతున్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఈ సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చిన నాయకత్వం, ఇప్పుడు అధికారంలో ఉండి కూడా చర్యలు తీసుకోకపోవడంతో కార్మికులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. సమ్మె ప్రారంభమైన తర్వాత కూడా ప్రభుత్వం చర్చలకు ముందుకు రాకపోవడం పరిస్థితిని మరింత ఉద్రిక్తం చేస్తోంది.

**ఆర్టీసీ కార్మికుల హెచ్చరిక.. విలీనం ఎప్పుడూ?**

ఆర్టీసీ కార్మికుల సమస్య కూడా ఇదే విధంగా కొనసాగుతోంది. ఎన్నికల సమయంలో ప్రభుత్వంలో విలీనం చేస్తామని హామీ ఇచ్చినప్పటికీ, ఇప్పటివరకు ఆ దిశగా స్పష్టమైన చర్యలు కనిపించలేదు. నెలరోజులుగా కార్మిక సంఘాలు చర్చలు జరిపినా ఫలితం లేకపోవడంతో సమ్మె నోటీస్ ఇచ్చాయి. ఈ నెల 22 నుండి సమ్మెకు వెళ్తామని ప్రకటించడం రాష్ట్రంలో రవాణా వ్యవస్థపై ప్రభావం చూపే అవకాశం ఉంది.

**సమస్యల పరిష్కారంలో విఫలం**

కార్మిక సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం చురుకుదనం చూపకపోవడం ప్రధాన విమర్శగా మారింది. విద్యుత్ శాఖ, ఆర్టీసీ వంటి కీలక విభాగాల్లో కార్మికులతో నేరుగా చర్చలు జరపకపోవడం వల్లే సమస్యలు తీవ్రతరమవుతున్నాయని కార్మిక సంఘాలు ఆరోపిస్తున్నాయి. అల్టిమేటంలు జారీ చేయడం తప్ప, సమస్య పరిష్కారానికి కృషి చేయడం లేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

**ఫిరాయించిన నేతల నిరసనలు**

అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ బలం పెంచుకునే క్రమంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను ఆకర్షిస్తూ, అభివృద్ధి హామీలతో కాంగ్రెస్ కండువా కప్పించగలిగింది. నియోజకవర్గాల్లో అభివృద్ధి బాధ్యతలు వారికే ఉంటాయని భరోసా ఇచ్చినా, పార్టీలో చేరిన తర్వాత పరిస్థితి భిన్నంగా మారింది. స్థానికంగా పోటీ చేసి ఓడిన నేతలతో వర్గపోరు తీవ్రరూపం దాల్చగా, చాలా మంది ఎమ్మెల్యేలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. హామీలు ఇచ్చి పార్టీలోకి చేర్చుకున్నప్పటికీ, ముఖ్యమంత్రి లేదా మంత్రులను కలిసే అవకాశం కూడా దొరకడం లేదని కొందరు బహిరంగంగానే ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ పరిణామాల మధ్య పటాన్‌చెర్వు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తిరిగి బీఆర్ఎస్‌లో చేరడం అధికార పార్టీకి పెద్ద షాక్‌గా మారింది. తిరిగి టీఆర్ఎస్ లో వెళ్లడమే కాకుండా అదే సమయంలో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో నియోజకవర్గం మొత్తం టిఆర్ఎస్ పార్టీ చైర్మన్లను గెలిపించుకున్నారు .ఇది పరోక్షంగా తన బలమేంటో ప్రభుత్వానికి చెప్పకనే చెప్పారు .ఇదే సమయంలో ప్రభుత్వ సలహాదారు, బాన్స్‌వాడ ఎమ్మెల్యే సీనియర్ రాజకీయ నాయకుడు,మాజీ మంత్రి పోచారం శ్రీనివాస రెడ్డి చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా మరింత కలకలం రేపాయి. ప్రభుత్వం కొనసాగుతుందా అనే సందేహం వ్యక్తం చేస్తూ, గతంలో ఫోన్ చేస్తే నిధులు మంజూరు చేసేవారని, ఇప్పుడు ఫోన్‌లకే స్పందన లేదని విమర్శించడం గమనార్హం. ముఖ్యమంత్రికి పలుమార్లు చెప్పినా పనులు జరగడం లేదని, ప్రజల కోసం పని చేయడం కష్టంగా మారిందని వ్యాఖ్యానించడం ప్రభుత్వంపై పెరుగుతున్న అంతర్గత అసంతృప్తికి నిదర్శనంగా భావించబడుతోంది.

**వర్గపోరు..తిరిగి మారుతున్న నేతలు**

పార్టీ మారిన ఎమ్మెల్యేలు స్థానికంగా వర్గపోరును ఎదుర్కొంటున్నారు. కొందరికి తప్ప మిగిలినవారంతా ఇబ్బందులు పడుతున్నట్లు తెలుస్తోంది. ఈ పరిస్థితుల్లో కొందరు తిరిగి తమ పాత పార్టీల వైపు మొగ్గు చూపడం గమనార్హం. ఇది అధికార పార్టీకి రాజకీయంగా ప్రతికూల సంకేతాలుగా మారుతోంది. ఇటీవల ప్రభుత్వ సలహాదారుడే ప్రభుత్వం కొనసాగుతుందా అనే సందేహం వ్యక్తం చేయడం రాజకీయంగా కలకలం రేపింది. తన పనులు కూడా జరగడం లేదని, ప్రజల సమస్యలను పరిష్కరించడం కష్టమైందని వ్యాఖ్యానించడం పాలనపై ప్రశ్నలు లేవనెత్తుతోంది. ఇది ప్రభుత్వంపై అంతర్గత అసంతృప్తి ఎంత స్థాయిలో ఉందో చూపిస్తోంది.

**అభివృద్ధి పనులకు ఆటంకం..**

ఇక అభివృద్ధి పనుల విషయంలో కూడా పరిస్థితి ఆందోళనకరంగా మారింది. నిధుల కొరత, చెల్లింపుల ఆలస్యం కారణంగా కాంట్రాక్టర్లు పనులు కొనసాగించలేకపోతున్నారు. ఇప్పటికే చేపట్టిన పనులు కూడా మధ్యలోనే నిలిచిపోయే పరిస్థితి ఏర్పడింది. దీంతో అభివృద్ధి ప్రాజెక్టులు మందగిస్తున్నాయి. ఒకవైపు అమలు కాని హామీలు, మరోవైపు పెరుగుతున్న సమ్మెలు, రాజకీయ అసంతృప్తి ఇవి అన్నీ కలిసి తెలంగాణలో పరిపాలనపై అనిశ్చితి వాతావరణాన్ని సృష్టిస్తున్నాయి. ప్రభుత్వం తక్షణమే స్పందించి సమస్యలను పరిష్కరించకపోతే పరిస్థితి మరింత సంక్లిష్టంగా మారే అవకాశముందని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు.





# అంబేడ్కర్ ఆశయాలే ప్రభుత్వానికి మార్గదర్శకం

**మొదటిపేజీ తరువాయి**

చర్యలు తీసుకుంటున్నారని విమర్శించారు. అంబేడ్కర్ ఆలోచనలకు వ్యతిరేకంగా కేంద్రం వ్యవహరిస్తోందని అన్నారు.

గత పదేళ్ల పాలన కారణంగా రాష్ట్రానికి తీవ్ర నష్టం జరిగిందని, గతంలో తీసుకున్న అప్పులను చెల్లిస్తూ తప్పులను సరిదిద్దుకుంటూ పాలన సాగిస్తున్నామని తెలిపారు. ప్రస్తుత ప్రజా ప్రభుత్వంలో దళితులకు అధిక ప్రాధాన్యత కల్పిస్తున్నామని వివరించారు.

సమాన అవకాశాల ద్వారా దేశ అభివృద్ధి సాధ్యమని అంబేడ్కర్ చూపిన మార్గాన్ని ప్రభుత్వం అనుసరిస్తోందని సీఎం పేర్కొన్నారు. పేదలకు నాణ్యమైన విద్య అందించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టామని, తెలంగాణ పబ్లిక్ స్కూల్ విధానం ద్వారా విద్యార్థుల భవిష్యత్ మెరుగుపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

దక్షిణాది రాష్ట్రాల్లో జనాభా నియంత్రణ పాటించిన రాష్ట్రాలకు ఇప్పుడు సీట్ల సంఖ్య తగ్గించే పరిస్థితి తీసుకురావడం తగదని సీఎం అన్నారు. దక్షిణాది రాష్ట్రాలపై రాజకీయంగా అన్యాయం జరుగుతోందని విమర్శించారు. రాష్ట్ర హక్కుల పరిరక్షణ కోసం అవసరమైతే పోరాటం కొనసాగిస్తామని తెలిపారు.



# నిప్పులు కుమ్మరించినట్టు రాష్ట్రంలో మండుతున్న ఎండలు

- **ఉదయం 9 గంటల నుంచే భానుడి భగభగలు -**
- **రాష్ట్రంలో 42 డిగ్రీలకు పైగా నమోదవుతున్న గరిష్ఠ ఉష్ణోగ్రతలు**
- **పలు జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరికలు జారీ**

**హైదరాబాద్, ఏప్రిల్ 14, సిరి న్యూస్:**

తెలంగాణ రాష్ట్రంలో ఎండల తీవ్రత రోజురోజుకు పెరుగుతూ ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తోంది. ఉదయం 9 గంటల నుంచే భానుడు తీవ్రంగా మండిపోతుండటంతో పగటిపూట బయటకు రావడానికి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాష్ట్రంలో అనేక ప్రాంతాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 42 డిగ్రీలకు పైగా నమోదవుతున్నాయి.

ఇటీవల ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో 42.4 డిగ్రీలు, ఆదిలాబాద్‌లో 42.3 డిగ్రీలు నమోదయ్యాయి. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో 41 డిగ్రీలు, ఖమ్మంలో 40.4 డిగ్రీలు, హైదరాబాద్‌లో 40.1 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఎండ తీవ్రతతో పాటు ఉక్కపోత కూడా పెరగడంతో ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు.


***పలు జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరికలు***

ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకుని వాతావరణశాఖ అధికారులు పలు జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరికలు జారీ చేశారు. ఉమ్మడి ఆదిలాబాద్, మహబూబ్‌నగర్, నిజామాబాద్ జిల్లాలతో పాటు జగిత్యాల, సిరిసిల్ల, హైదరాబాద్ ప్రాంతాలకు ఈ హెచ్చరికలు వర్తిస్తాయని తెలిపారు. రాబోయే రోజుల్లో ఎండలు మరింత పెరిగే అవకాశముందని హెచ్చరించారు.

ఇవాళ ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్ జిల్లాల్లో వడగాల్పులు వీచే అవకాశం ఉందని అధికారులు పేర్కొన్నారు. రేపు ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, ఖమ్మం జిల్లాల్లో వడగాల్పుల ప్రభావం ఉండే అవకాశముందని తెలిపారు. ఎల్లుండి ఆదిలాబాద్‌తో పాటు నిజామాబాద్, జగిత్యాల, సిరిసిల్ల, ఖమ్మం జిల్లాల్లో వడగాల్పులు వీచే అవకాశం ఉందని వెల్లడించారు.రానున్న ఐదు రోజుల పాటు రాష్ట్రవ్యాప్తంగా ఉష్ణోగ్రతలు మరింత పెరిగే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణశాఖ అధికారి ధర్మరాజు తెలిపారు. ఉత్తర, దక్షిణ తెలంగాణ జిల్లాలతో పాటు హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలకు కూడా ఆరెంజ్ హెచ్చరికలు జారీ చేసినట్లు వివరించారు. ఉత్తర తెలంగాణ జిల్లాల్లో వడగాల్పుల ప్రభావం అధికంగా ఉండే అవకాశముందని హెచ్చరించారు.

# రాష్ట్రంలో మావోయిస్టుల ప్రభావం లేదు

- **రాష్ట్రంలో మావోయిస్టుల ప్రభావం లేదు వీఐపీల సెక్యూరిటీ విడతల వారీగా తగ్గిస్తాం: డీజీపీ శివధర్‌రెడ్డి**



**ఆదిలాబాద్,ఏప్రిల్, సిరి న్యూస్:**

తెలంగాణ రాష్ట్రంలో ప్రస్తుతం మావోయిస్టుల ప్రభావం పూర్తిగా తగ్గిపోయిందని డీజీపీ శివధర్‌రెడ్డి తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రజాప్రతినిధులు, అధికారులకు కల్పిస్తున్న భద్రతపై పోలీస్ శాఖ పునఃసమీక్ష చేపడుతోందని వెల్లడించారు. భవిష్యత్తులో వీఐపీల సెక్యూరిటీని విడతల వారీగా తగ్గించే యోచనలో ఉన్నామని తెలిపారు. అయితే తక్షణమే భద్రతను తగ్గించడం సాధ్యం కాదని స్పష్టం చేశారు.

ఆదిలాబాద్ జిల్లా మారుమూల గూడెం చించుఘాట్‌లో పర్యటించిన డీజీపీకి స్థానిక ఆదివాసీలు సంప్రదాయ గుస్సాడీ నృత్యాలతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన ఆదివాసీలతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన గ్రంథాలయాన్ని ప్రారంభించి, గ్రామ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

ఆదివాసీల సంస్కృతి, ఆచారాలు ఎంతో గొప్పవని డీజీపీ కొనియాడారు. తమ సంప్రదాయాలను కాపాడుకోవాలని సూచించారు. ప్రతి గ్రామంలో లైబ్రరీ ఏర్పాటు చేసుకోవాలని, పుస్తక పఠనానికి ప్రాధాన్యత ఇవ్వాలని యువతకు సూచించారు. సెల్‌ఫోన్ వినియోగంతో సమయం వృథా కాకుండా పుస్తకాలు చదివితే జ్ఞానం పెరుగుతుందని వివరించారు.

గ్రామాన్ని గంజాయి రహిత గూడెంగా మార్చేందుకు గ్రామ పంచాయతీ చేసిన తీర్మానాన్ని డీజీపీకి అందజేశారు. పోలీస్ శాఖ తరఫున స్థానిక యువతకు హెల్మెట్లను పంపిణీ చేసిన ఆయన, వాహనాలు నడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు.

# ఉత్తరాది, దక్షిణాది అంటూ విభేదాలు

- **ప్రజలను బంట్రోతులుగా చూస్తున్నారా?**
- **లక్ష్మణ్ వలసపోయారని విమర్శలా**
- **ఇందిర, రాహుల్, ప్రియాంక ఎక్కడి నుంచి వచ్చారు**
- **రేవంత్ వ్యాఖ్యలపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఆగ్రహం**

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 14, సిరి న్యూస్:**

ఉత్తరాది, దక్షిణాది రాష్ట్రాల మధ్య విభజన తీసుకొచ్చే విధంగా తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతున్నారంటూ కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి ధ్వజమెత్తారు. ఢిల్లీలోని అంబేడ్కర్ ఇంటర్నేషనల్ సెంటర్‌లో మంగళవారం జరిగిన కార్యక్రమంలో పాల్గొని అంబేడ్కర్ విగ్రహానికి ఆయన నివాళులర్పించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ రేవంత్ రెడ్డి వ్యాఖ్యలను ఖండించారు. బంట్రోతు పోస్ట్ దొరకదని అంటున్నారని.. ప్రజలను బంట్రోతులుగా చూస్తున్నారా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. తప్పుడు మాటలు మాట్లాడొద్దని, వాస్తవాలు మాట్లాడాలని, వితండవాదనలు పక్కన పెట్టాలని సూచించారు. రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు బాబా సాహెబ్ అంబేద్కర్ ఆశయాలకు వ్యతిరేకంగా ఉన్నాయన్నారు. కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా, తెలుగువారి ఆత్మగౌరవంగా టీడీపీ పుట్టిందని ప్రస్తావించారు. దక్షిణాది రాష్ట్రాల నుంచి ఇద్దరు ఉప రాష్ట్రపతులుగా ఉన్నారని, వెంకయ్య నాయుడు ఉప రాష్ట్రపతిగా పనిచేశారని గుర్తు చేశారు. తాను ఒక్కడినే మేధావిని అనుకుని అద్దాల మేడలో కూర్చుని సీఎం రేవంత్ రెడ్డి రాళ్లు వేయడం మంచిది కాదని హితవు పలికారు. ఇందిరా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీ ఎక్కడినుంచి వచ్చారని ప్రశ్నించారు. దేశం మొత్తం ఒకటి కాదా అని ప్రశ్నించారు. లక్ష్మణ్ వలస పోయారని రేవంత్ రెడ్డి అంటున్నారని, మరి ఇందిరాగాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంకాగాంధీ ఎక్కడి నుంచి పోటీ చేశారని కిషన్ రెడ్డి నిలదీశారు. కాంగ్రెస్‌ను రాహుల్ గాంధీ బుద్ధితో నడిపిస్తే రేవంత్ రెడ్డి డబ్బులతో నడిపిస్తున్నారని ఎద్దేవా చేశారు. రేవంత్ రెడ్డి కాంగ్రెస్‌కు అధికారికంగా కోశాధికారిగా పనిచేస్తున్నారని సెటైర్లు గుప్పించారు. డీలిమిటేషన్‌తో ఎన్ని సీట్లు పెరుగుతాయనేది పార్లమెంటు సమావేశాల్లో తెలుస్తుందని చెప్పారు.

# జీవన్‌రెడ్డికి మర్యాద తగ్గించలేదు

- **పరిస్థితులను పంచుకునేందుకే మీతో సమావేశం**
- **జగిత్యాల ముఖ్య నేతలతో రేవంత్ భేటీ**
- **మేమంతా కాంగ్రెస్‌లోనే కొనసాగుతాం**
- **స్పష్టం చేసిన నాయకులు**



**హైదరాబాద్, ఏప్రిల్ 14, సిరి న్యూస్:**

జగిత్యాల నియోజకవర్గ ముఖ్య నాయకులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంగళవారం తన నివాసంలో భేటీ అయ్యారు. 20వ తేదీన జగిత్యాలలో కేసీఆర్ బహిరంగ సభ, కాంగ్రెస్‌కు రాజీనామా చేసిన మాజీ ఎమ్మెల్సీ టి.జీవన్‌రెడ్డి బీఆర్ఎస్‌లో చేరనున్న సందర్భంగా ఈ భేటీ ప్రాధాన్యం సంతరించుకుంది. రాష్ట్రంలో పరిస్థితులను పంచుకోవాలనే మీతో సమావేశమయ్యానంటూ తాము ఎప్పుడూ జీవన్ రెడ్డిని తక్కువ చేసి చూడలేదు.. ఆయన మర్యాదను తగ్గించేలా మాట్లాడలేదు.. ఆయన గౌరవాన్ని తగ్గించేలా వ్యవహరించలేదు అని సీఎం రేవంత్ స్పష్టం చేశారు. 2023 ఎన్నికల్లో ఆయన గెలుపు కోసం అంతా కష్టపడ్డాం.. పార్లమెంటు ఎన్నికల్లో ఆయన్ను కరీంనగర్ నుంచి పోటీ చేయాలని సూచిస్తే నిజామాబాద్ నుంచి పోటీ చేస్తానని కోరినా పార్టీ టికెట్ ఇచ్చిందని తెలిపారు. దురదృష్టవశాత్తు ఆయన ఓడిపోయారు.. మున్సిపల్ ఎన్నికల్లో కూడా జీవన్ రెడ్డి సూచించిన వారికే టికెట్లు ఇచ్చాం.. ఆయనకు, ఆయన కుటుంబ సభ్యుల రాజకీయ భవిష్యత్తుకు హామీ ఇచ్చినా వినలేదు అని తెలిపారు. మొండిపట్టుతో ఆయన పార్టీ వీడారని చెప్పారు. 40 ఏండ్లు ఆయన కోసం పని చేసిన కార్యకర్తలను మోసం చేసి దుర్మార్గుడైన కేసీఆర్‌తో జతకట్టారని ఆరోపించారు. ఆయన లాంటి వ్యక్తి కేసీఆర్ దగ్గర చేతులు కట్టుకుని నిలబడటం అత్యంత బాధాకరమన్నారు. జగిత్యాల కాంగ్రెస్ కార్యకర్తల ఆత్మగౌరవాన్ని జీవన్ రెడ్డి కేసీఆర్ కాళ్ల దగ్గర తాకట్టు పెట్టారని రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ఆయన వయసుకు, అనుభవానికి ఇది తగదన్నారు. ఈనాటికీ తా□ను ఆయన గౌరవానికి భంగం కలిగేలా ఒక్క మాట మాట్లాడలేదన్నారు. కుట్రలను తిప్పికొట్టాలని మనం ప్రయత్నం చేస్తుంటే ఆయన వెళ్లి అక్కడ చేరారన్నారు. ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వాన్ని పడగొడతామంటే నిలబెట్టడం తప్పా.. తాను చేస్తున్నది మంచో చెడో మీరే ఆలోచించండి.. ఎవరు ఏమిటి అన్నది కాలమే నిర్ణయిస్తుంది అని అన్నారు.

**త్వరలో జగిత్యాలకు వస్తా..**

అండగా నిలబడండి.. మళ్లీ కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకొద్దాం.. ధైర్యంగా ఉండండి.. త్వరలోనే కార్యకర్తలను కలిసేందుకు జగిత్యాలకు వస్తా.. కలిసికట్టుగా జగిత్యాలను అభివృద్ధి చేసుకుందాం అని సీఎం రేవంత్ హామీ ఇచ్చారు. వ్యక్తికంటే పార్టీ ముఖ్యమని నిరూపించిన మీ అందరినీ అభినందిస్తున్నానన్నారు. కాగా, పెద్ద నాయకులు పార్టీని వీడినా తాము కాంగ్రెస్‌లోనే కొనసాగుతామని జగిత్యాల నాయకులు స్పష్టం చేశారు. ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి మరింత బలంగా తీసుకెళతామని చెప్పారు. రాష్ట్రంలో కాంగ్రెస్‌ను రెండోసారి అధికారంలోకి తీసుకువచ్చేందుకు కలిసికట్టుగా పనిచేస్తామని సీఎంకు హామీ ఇచ్చారు. ఈ భేటీకి మంత్రులు తుమ్మల నాగేశ్వర రావు, అడ్లూరి లక్ష్మణ్, ఎంపీ వేం నరేందర్ రెడ్డి, ఎమ్మెల్యే సంజయ్, జగిత్యాల డీసీసీ అధ్యక్షుడు నందయ్య, ఇతర ముఖ్య నాయకులు హాజరయ్యారు.

# 850 లోక్‌సభ స్థానాలు

**న్యూఢిల్లీ, ఏప్రిల్ ,14, సిరి న్యూస్:**

దేశంలోని చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం కీలక చర్యలు చేపడుతోంది. ఈ నేపథ్యంలో మూడు ముఖ్యమైన బిల్లులను ఈనెల 16న లోక్‌సభలో ప్రవేశపెట్టేందుకు సిద్ధమైంది. కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్‌రామ్ మేఘవాల్ 131వ రాజ్యాంగ సవరణ బిల్లు, నియోజకవర్గాల పునర్విభజన బిల్లును సభలో ప్రవేశపెట్టనున్నారు.

ఈ బిల్లుల ద్వారా లోక్‌సభతో పాటు రాష్ట్ర శాసనసభల సీట్ల పునర్విభజన చేపట్టనున్నారు. ప్రస్తుతం లోక్‌సభలో ఉన్న 543 స్థానాలను గరిష్టంగా 850కు పెంచే ప్రతిపాదనను కేంద్రం తీసుకువచ్చింది. ఇందులో రాష్ట్రాలకు 815 స్థానాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు 35 స్థానాలు కేటాయించే అవకాశం ఉంది.

***డీలిమిటేషన్ కమిషన్ ఏర్పాటు***

చట్టం అమలులోకి వచ్చిన తర్వాత లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన కోసం ప్రత్యేకంగా డీలిమిటేషన్ కమిషన్‌ను ఏర్పాటు చేయనున్నారు. సుప్రీంకోర్టు ప్రస్తుత లేదా మాజీ న్యాయమూర్తి స్థాయి వ్యక్తి ఈ కమిషన్‌కు ఛైర్మన్‌గా వ్యవహరిస్తారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ లేదా ఆయన ప్రతినిధి, సంబంధిత రాష్ట్ర ఎన్నికల కమిషన్ ప్రతినిధులు సభ్యులుగా ఉంటారు.

కమిషన్‌కు సహకరించేందుకు ప్రతి రాష్ట్రం నుంచి 10 మంది సభ్యులను ఎంపిక చేయనున్నారు. అందులో ఐదుగురు లోక్‌సభ సభ్యులు, ఐదుగురు శాసనసభ సభ్యులను సంబంధిత సభల స్పీకర్లు నామినేట్ చేస్తారు.

**2011 జనాభా లెక్కల ఆధారంగా సీట్ల పెంపు***

లోక్‌సభ సీట్ల పెంపును 2011 జనాభా లెక్కల ఆధారంగా చేపట్టాలని కేంద్రం బిల్లులో ప్రతిపాదించింది. అదే గణాంకాల ప్రకారం ఎస్సీ, ఎస్టీ వర్గాలకు రిజర్వేషన్లు ఖరారు చేయనున్నారు. మహిళలకు 33 శాతం రిజర్వేషన్ల అంశాన్ని కూడా ఈ బిల్లులో చేర్చారు.

లోక్‌సభతో పాటు రాష్ట్ర శాసనసభల్లో కూడా సాధ్యమైనంత మేరకు మూడో వంతు సీట్లను మహిళలకు కేటాయించేలా కమిషన్ చర్యలు తీసుకోనుంది. ఈ రిజర్వేషన్లలో ఎస్సీ, ఎస్టీ మహిళలకు కూడా ప్రత్యేక భాగం ఉంటుందని కేంద్రం స్పష్టం చేసింది. రొటేషన్ విధానంలో మహిళా రిజర్వేషన్లు అమలు చేయనున్నట్లు తెలిపింది.

**కేంద్రపాలిత ప్రాంతాల చట్టాల్లో సవరణలు***

కేంద్రపాలిత ప్రాంతాల్లో కూడా మహిళా రిజర్వేషన్ల అమలును సులభతరం చేసేందుకు ప్రత్యేక సవరణ బిల్లును ప్రవేశపెట్టనున్నారు. ఈ బిల్లును కేంద్ర హోంమంత్రి అమిత్ షా లోక్‌సభలో ప్రవేశపెట్టనున్నారు. ఈ సవరణల ద్వారా అసెంబ్లీలు ఉన్న ఢిల్లీ, జమ్ముకశ్మీర్, పుదుచ్చేరి ప్రాంతాలకు సంబంధించిన మూడు చట్టాలను సవరించనున్నారు. నియోజకవర్గాల పునర్విభజనతో పాటు మహిళలకు 33 శాతం రిజర్వేషన్ల అమలే ఈ మార్పుల ప్రధాన లక్ష్యంగా కేంద్రం వెల్లడించింది.



# ఆర్టికల్ 370 రద్దు తర్వాత పూర్తిగా అమల్లోకి రాజ్యాంగం

- **దిల్లీ, డెహ్రాడూన్ ఎకనామిక్ కారిడార్ ప్రారంభం-**
- **హరిద్వార్‌లో జరగనున్న కుంభమేళా సందర్భంగా ఉత్తరాఖండ్‌ను శుభ్రంగా ఉంచాలని పిలుపు**



**డెహ్రాడూన్, ఏప్రిల్ 14, సిరి న్యూస్:**

డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆశయాల మేరకు రాజ్యాంగ గౌరవాన్ని పునరుద్ధరించేందుకు కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ఆర్టికల్ 370 రద్దు అనంతరం దేశవ్యాప్తంగా రాజ్యాంగం పూర్తిగా అమల్లోకి వచ్చిందని తెలిపారు. ఉత్తరాఖండ్ రాష్ట్రం ఉమ్మడి పౌరస్మృతిని అమలు చేసిన తొలి రాష్ట్రంగా నిలిచిందని కొనియాడారు. మంగళవారం దిల్లీ-డెహ్రాడూన్ ఎకనామిక్ కారిడార్‌ను ప్రధాని ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ల అమల్లో ఎలాంటి జాప్యం ఉండకూడదని స్పష్టం చేశారు.

అంబేద్కర్ జయంతి సందర్భంగా ఆయనకు నివాళులు అర్పిస్తూ, సామాజిక న్యాయం కోసం అంబేద్కర్ జీవితాంతం పోరాడారని గుర్తుచేశారు. అదే దిశగా కేంద్ర ప్రభుత్వం మౌలిక వసతులు, పరిశ్రమల అభివృద్ధి ద్వారా సమగ్ర అభివృద్ధి సాధించేందుకు కృషి చేస్తోందని తెలిపారు.

**2029 నుంచే మహిళా రిజర్వేషన్లు**

పార్లమెంట్ నారీశక్తి వందన్ చట్టాన్ని ఆమోదించడం దేశ చరిత్రలో కీలక ఘట్టమని ప్రధాని మోదీ పేర్కొన్నారు. మహిళల సంక్షేమం, రక్షణ, ప్రజాస్వామ్యంలో భాగస్వామ్యం కేంద్ర ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్య అంశమని తెలిపారు.

లోక్‌సభ, శాసనసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు ఇప్పటికే ఖరారయ్యాయని చెప్పారు. 2029లో జరిగే లోక్‌సభ ఎన్నికల నుంచి ఈ రిజర్వేషన్లు అమల్లోకి రావాలని అభిప్రాయపడ్డారు. మహిళల ఆకాంక్షలను గౌరవిస్తూ ఈ అంశంపై పార్లమెంట్‌లో చర్చలు ప్రారంభం కానున్నాయని వెల్లడించారు.

**దేవభూమి పరిశుభ్రతపై దృష్టి**

హరిద్వార్‌లో జరగబోయే కుంభమేళాను వైభవంగా, పరిశుభ్రంగా నిర్వహించాలని ప్రధాని పిలుపునిచ్చారు. ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్త కారణంగా దేవభూమి పవిత్రత దెబ్బతింటోందని ఆందోళన వ్యక్తం చేశారు. పుణ్యక్షేత్రాలను పరిశుభ్రంగా ఉంచడం ప్రతి ఒక్కరి బాధ్యత అని సూచించారు.

**టూరిజం అభివృద్ధితో ఉపాధి**

ఉత్తరాఖండ్ రాష్ట్ర అభివృద్ధికి ఏడాది పొడవునా పర్యాటకం ఎంతో అవసరమని ప్రధాని తెలిపారు. శీతాకాల పర్యాటకం, వింటర్ స్పోర్ట్స్, డెస్టినేషన్ వెడ్డింగ్స్‌కు రాష్ట్రం ప్రముఖ కేంద్రంగా మారుతోందని పేర్కొన్నారు. పర్యాటకుల సంఖ్య పెరగడంతో స్థానికులకు ఉపాధి అవకాశాలు కూడా పెరిగాయని చెప్పారు. దిల్లీ-డెహ్రాడూన్ ఎకనామిక్ కారిడార్ ప్రారంభంతో రెండు నగరాల మధ్య ప్రయాణ సమయం ఆరు గంటల నుంచి సుమారు మూడు గంటలకు తగ్గనుందని తెలిపారు. 213 కిలోమీటర్ల పొడవైన ఈ ఆరు లేన్ల రహదారిని సుమారు 12 వేల కోట్ల వ్యయంతో నిర్మించినట్లు వెల్లడించారు.

# బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో దోపిడీనే

- **కవిత ప్రశ్నలకు సమాధానం చెప్పి తీరాలి**
- **కేటీఆర్ పాదయాత్రలు చేసినా ప్రజలు నమ్మరు**
- **కాంగ్రెస్ కమిటీ బాధ్యతల స్వీకారంలో పీసీసీ చీఫ్**



**ఖమ్మం, ఏప్రిల్ 14, సిరి న్యూస్:**

బీఆరఎస్ నేతలు పదేళ్లపాటు దుర్మార్గమైన పరిపాలన చేశారని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ ధ్వజమెత్తారు. కేటీఆర్ పాదయాత్ర చేస్తానంటున్నారని, ఆయన పాదయాత్ర కాదు ఏం చేసినా రాష్ట్ర ప్రజలు బీఆర్ఎస్‌ని క్షమించరని హెచ్చరించారు. కేసీఆర్ అప్పులు చేసి ఫాంహౌస్‌లో పడుకున్నారని ఎద్దేవా చేశారు. కేటీఆర్ పాదయాత్రకు ముందు చెల్లి కవిత అడుగుతున్న ప్రశ్నలకు సమాధానం చెప్పాలని సవాల్ విసిరారు. ఖమ్మంలో డీసీసీ కొత్త కార్యవర్గం ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గత పదేళ్ల కేసీఆర్ హయాంలో ఏం చేశారని ఆర్థిక మంత్రి మల్లు భట్టివిక్రమార్క లెక్కలతో సమాధానాలు అడుగుతుంటే కేసీఆర్ అండ్ కో సతమతమవుతున్నారని వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ నేత సంతోశ్‌రావు ఎలా సంతోషంగా ఉన్నారో, మాజీ మంత్రి హరీశ్‌రావు ఆనందం ఏంటో, దోపిడీ ఎంతో చెల్లెలు కవిత చెబుతోందని సెటైర్లు గుప్పించారు. పదేళ్లు దోపిడీకి అలవాటుపడి ప్రజల ఆగ్రహానికి గురై పదవులు కోల్పోయి నేడు విలవిలలాడుతున్నారని విమర్శించారు. కేటీఆర్ అండ్ కో పిచ్చి మాటలు మాట్లాడుతూ అనవసర ఆరోపణలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా ఈ దేశంలో ప్రధాన పాత్ర పోషిస్తోందని చెప్పారు. ఖమ్మం జిల్లా కాంగ్రెస్‌కు ఎప్పుడూ అండగా నిలిచిందన్నారు. బ్లాక్ కాంగ్రెస్ కార్యకర్తగా ఉన్న పీవీ నరసింహారావు దేశ ప్రధాని అయ్యారని, ఇది ఒక్క కాంగ్రెస్‌కే సాధ్యమని చెప్పారు. గ్రామస్థాయి నుంచి పార్టీ బలోపేతం కావాలని మహేశ్ కుమార్ పిలుపునిచ్చారు. కార్యకర్తల కష్టంతో నేడు అధికారంలోకి వచ్చామని, పార్టీలో సామాన్య కార్యకర్తలు కీలక పదవులు పొందారని చెప్పారు. భట్టి విక్రమార్క చేసిన పాదయాత్ర చరిత్రలో నిలిచిపోయిందని ఉద్ఘాటించారు. ఖమ్మం గడ్డపై నిలబడి చెబుతున్నా.. వచ్చే ఎన్నికే కాదు.. ఆ తర్వాత వచ్చే ఎన్నికల్లో కూడా కాంగ్రెస్‌దే విజయమని అన్నారు. చేతనైతే తమ విజయాన్ని అడ్డుకోవాలని ప్రతిపక్షాలకు సవాల్ విసిరారు. ఎన్నికల సమయంలో రేవంత్ రెడ్డి, భట్టి విక్రమార్క ప్రజలకు ఇచ్చిన ప్రతి ఒక్క హామీని నెరవేరుస్తున్నామని తెలిపారు. ఖమ్మం నుంచే కాంగ్రెస్ విజయం ప్రారంభమైందని చెప్పారు. పార్టీ కోసం పని చేసే ప్రతి ఒక్కరినీ గుర్తిస్తామని మహేశ్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి, ఎమ్మెల్యేలు మట్టా రాగమయి దయానంద్, రాందాస్ నాయక్ తదితరులు హాజరయ్యారు.

## ప్రతి పౌరుడికి సమానహక్కులు కల్పించింది అంబేద్కరే

### మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ కృష్ణారెడ్డి, చిట్టిబాబు

### జోగిపేటలో ఘనంగా అంబేద్కర్ జయంతి



**జోగిపేట, ఏప్రిల్ 14, (సిరి న్యూస్)::**

అంబేద్కర్ దేశానికి అందించిన రాజ్యాంగం ప్రతి పౌరునికి సమాన హక్కులను కల్పించిందని మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎస్.కృష్ణారెడ్డి, ఆకుల చిట్టిబాబు ముదిరాజ్‌లు అన్నారు. జోగిపేట–అందోలు మున్సిపాలిటీ పరిధిలో అంబేద్కర్ జయంతి వేడుకలను మంగళవారం ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్‌లు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజంలో అణగారిన వర్గాల అభ్యున్నతికి ఆయన చేసిన కృషి చిరస్మరణీయమన్నారు. ప్రతి ఒక్కరూ అంబేద్కర్ ఆశయాలను ఆచరణలో పెట్టి సమానత్వం, సామాజిక న్యాయం కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రవీందర్, మాజీ మార్క్‌ఫెడ్ డైరెక్టర్ జగన్మోహన్‌రెడ్డి, కౌన్సిలర్లు రాజశేఖర్, మర్రి అరుణ కుమారి, పి.శ్రీనివాస్, అరుణ్‌కుమార్, దుర్గేష్, రామకృష్ణ, నాగరత్నం గౌడ్, మాధవి శ్రీనివాసయాదవ్, మాజీ చైర్మన్ జి.మల్లయ్య, మాజీ కౌన్సిలర్ నాగరాజు, హరికృష్ణగౌడ్, సంతోష్‌కుమార్, ప్రవీణ్, ప్రదీప్‌గౌడ్, సునీల్‌కుమార్‌లతో పాటు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు

### ఘనంగా నివాళ్ళు అర్పించిన రుశ్వంత్ రెడ్డి



**అమీన్ పూర్ ఏప్రిల్ 14 సిరి న్యూస్**

అమీన్ పూర్ డివిజన్ పరిధిలోని అంబేద్కర్ కాంస్య విగ్రహానికి యువ నాయకులు రుశ్వంత్ రెడ్డి , మాజీ వైస్ చైర్మన్ నరసింహ గౌడ్ ఆధ్వర్యంలో పూలమాలు వేసి ఘనంగా నివాళ్ళు అర్పించారు.ఈ సందర్భంగా రుశ్వంత్ రెడ్డి మాట్లాడుతూ... డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ 135 వ జయంతి సందర్భంగా అమీన్పూర్ సర్కిల్ పరిధిలోని కొన్ని విగ్రహానికి పూలమాలలు వేసి నాయకులతో కలిసి నివాళులు అర్పించడం జరిగింది. సమానత్వం సామాజిక న్యాయం కోసం అంబేద్కర్ చేసిన సేవలను స్మరించుకోవాలని అన్నారు. యువత అంబేద్కర్ ఆలోచనలను అనుసరించాలని ఆయన తెలిపారు. సమాజాభివృద్ధి కి అంబేద్కర్ మార్గదర్శకమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ దేవానంద్ ముదిరాజ్, కృష్ణ ఉపేందర్ రెడ్డి గోపాల్ ప్రమోద్ రెడ్డి తలారి రాములు యాదగిరి రాజు గౌడ్ దాసు భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వెలిమెలలో అంబేద్కర్ జయంతి వేడుకలు



**రామచంద్రపురం, ఏప్రిల్ 14 (సిరి న్యూస్):**

ముత్తంగి డివిజన్‌లోని వెలిమెల గ్రామంలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కాల్వగడ్డ రాజ్‌కుమార్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి వేడుకలను నిర్వహించారు.అంబేద్కర్ జయంతి సందర్భంగా రాజ్‌కుమార్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేసి రాజ్‌కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేద్కర్ ఆశయాలను ప్రతి ఒక్కరూ అనుసరించాలని, సమాజంలో సమానత్వం కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో బీడీఎల్ సబ్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశం, గ్రామ పెద్దలు, స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఘనంగా అంబేద్కర్ జయంతి వేడుకలు

**రామచంద్రాపురం, ఏప్రిల్ 14 (సిరి న్యూస్):**



భారతరత్న డా. బాబా సాహెబ్ అంబేద్కర్ గారి 136వ జయంతి సందర్భంగా పటాన్‌చెరు నియోజకవర్గంలో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ ఆదర్శ్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ సింధు రామచంద్రాపురం మరియు భారతీనగర్ ప్రాంతాల్లోని అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా అంబేద్కర్ ఆశయాలను కొనసాగించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పలువురు బీఆర్ఎస్ నాయకులు, మహిళా సంఘాలు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అంబేద్కర్ సేవలు చిరస్మరణీయం

- **మాజీ డిప్యూటీ స్పీకర్ యం.పద్మ దేవేందర్ రెడ్డి**
- **మెదక్ టిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఘనంగా అంబేద్కర్ జయంతి వేడుకలు**

**మెదక్ ఏప్రిల్ 14(సిరిన్యూస్)**



బడుగు,బలహీన వర్గాల అభ్యున్నతి కోసం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ చేసిన సేవలు చిరస్మరణీయమని మాజీ డిప్యూటీ స్పీకర్, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు యం. పద్మ దేవేందర్ రెడ్డి అన్నారు.భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ 135వ జయంతి సందర్భంగా మెదక్ జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం పార్టీ శ్రేణులతో కలిసి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా పద్మ దేవేందర్ రెడ్డి మాట్లాడుతూ, దేశంలోని అన్ని వర్గాల ప్రజలకు సమాన హక్కులు కల్పించిన ఘనత అంబేద్కర్‌కే దక్కుతుందని పేర్కొన్నారు. స్వేచ్ఛ, సమానత్వం కోసం ఆయన చేసిన పోరాటం అపారమని కొనియాడారు. దేశ స్వపరిపాలనకు ఆదర్శంగా నిలిచేలా రాజ్యాంగాన్ని రూపొందించిన దూరదృష్టి గల నాయకుడని తెలిపారు.రాజ్యాంగంలోని ఆర్టికల్ 3 ద్వారానే తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు సాధ్యమైందని గుర్తుచేశారు. కేసీఆర్ నాయకత్వంలో అంబేద్కర్ స్ఫూర్తిని కొనసాగిస్తూ తెలంగాణ సచివాలయానికి ఆయన పేరు పెట్టడంతో పాటు, ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన 125 అడుగుల అంబేద్కర్ విగ్రహాన్ని రాష్ట్రంలో ఏర్పాటు చేసినట్లు చెప్పారు.భవిష్యత్తులో బీఆర్ఎస్ పార్టీ మళ్లీ అధికారంలోకి వస్తుందని, కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపడతారని ఆశాభావం వ్యక్తం చేశారు.అంబేద్కర్ ఆశయాలతో నవ సమాజ నిర్మాణానికి కృషి కొనసాగిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ మల్లికార్జున్ గౌడ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ అకిరెడ్డి.కృష్ణారెడ్డి, పట్టణ పార్టీ కన్వీనర్ కౌన్సిలర్ మామిళ్ల ఆంజనేయులు,న్యాయవాది జీవన్ రావు, మున్సిపల్ కౌన్సిలర్లు దీపక్ కుమార్, సంధ్య నవీన్, ఉదయ్ కుమార్, గౌస్, సోహెల్, జుబేర్ అహ్మద్, మహిళా నాయ కురాలు అంకం.చంద్రకళ రాధ,నాయకులు, కిష్ట గౌడ్, అంజ గౌడ్, కిష్టయ్య, విశ్వం,లింగా రెడ్డి, ప్రభు రెడ్డి,కిషన్, మాయ. మల్లేశం, ఆర్కే శ్రీనివాస్, ఏనుగుల రాజు, సునీల్,రవి లక్ష్మీనారాయణ, దశరథం,ఇందాద్,సంతోష్ ,వెంకట్,ఆంజనేయులు,ప్రభాకర్ ,లక్ష్మణ్, కిషన్, మోహన్, ఇస్మాయిల్, రవి తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ జయంతి వేడుకలు వైభవంగా కాంగ్రెస్ సీనియర్ నాయకులు వి.చంద్రారెడ్డి

**జిన్నారం ఏప్రిల్ 14 సిరి న్యూస్**



అంబేద్కర్ ఆశయాలను ప్రతి ఒక్కరు ముందుకు తీసుకెళ్లాలని కాంగ్రెస్ సీనియర్ నాయకులు వి.చంద్రారెడ్డి అన్నారు. మంగళవారం ఖాజిపల్లి మరియు బొల్లారం డివిజన్లోని ఎస్సి కాలనీ, బీసీ కాలనీ'లో నిర్వహించిన అంబేద్కర్ 135 వ జయంతి వేడుకల్లో ఆయన కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు జైపాల్ రెడ్డి'తో కలిసి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులతో కలిసి అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం అంబేద్కర్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో చంద్రారెడ్డి మాట్లాడుతూ... రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని ముందుకు వెళ్లాలని పిలుపునిచ్చారు. రక్తదాన శిబిరంలో స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేసిన యువకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో సి.ఐ రవీందర్ రెడ్డి, జిన్నారం మాజీ ఎంపీపీ రవీందర్ గౌడ్, నర్సింహా, వాహబ్, నవీన్, అశోక్, రవుఫ్, మహేందర్, బొల్లారం డివిజన్ మాజీ కౌన్సిలర్స్ గోపాలమ్మ, నర్సింహారాజు, స్థానిక నాయకులు సంపత్ రెడ్డి, రాష్ట్ర కార్మిక నాయకులు వి.వరప్రసాద్ రెడ్డి, రాజగోపాల్, మాజీ ఎం.పీ.టీ.సీ కృష్ణంరాజు, బషీర్, చంద్రారెడ్డి, శంకర్, మాజీ వార్డ్ మెంబర్ భాస్కర్, ఇమ్రాన్, కుమార్, విశ్వనాథ్, నాని, బీరప్ప, యువజన నాయకులు ప్రవీణ్, శైలేష్, నవీన్, యూత్ అసోసియేషన్ సభ్యులు, ఆటో యూనియన్ నాయకులు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

# అంబేద్కర్ సేవలు చిరస్మరణీయం

- **మాజీ డిప్యూటీ స్పీకర్ యం.పద్మ దేవేందర్ రెడ్డి**
- **మెదక్ టిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఘనంగా అంబేద్కర్ జయంతి వేడుకలు**

**మెదక్ ఏప్రిల్ 14(సిరిన్యూస్)**



బడుగు,బలహీన వర్గాల అభ్యున్నతి కోసం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ చేసిన సేవలు చిరస్మరణీయమని మాజీ డిప్యూటీ స్పీకర్, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు యం. పద్మ దేవేందర్ రెడ్డి అన్నారు.భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ 135వ జయంతి సందర్భంగా మెదక్ జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం పార్టీ శ్రేణులతో కలిసి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా పద్మ దేవేందర్ రెడ్డి మాట్లాడుతూ, దేశంలోని అన్ని వర్గాల ప్రజలకు సమాన హక్కులు కల్పించిన ఘనత అంబేద్కర్‌కే దక్కుతుందని పేర్కొన్నారు. స్వేచ్ఛ, సమానత్వం కోసం ఆయన చేసిన పోరాటం అపారమని కొనియాడారు. దేశ స్వపరిపాలనకు ఆదర్శంగా నిలిచేలా రాజ్యాంగాన్ని రూపొందించిన దూరదృష్టి గల నాయకుడని తెలిపారు.రాజ్యాంగంలోని ఆర్టికల్ 3 ద్వారానే తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు సాధ్యమైందని గుర్తుచేశారు. కేసీఆర్ నాయకత్వంలో అంబేద్కర్ స్ఫూర్తిని కొనసాగిస్తూ తెలంగాణ సచివాలయానికి ఆయన పేరు పెట్టడంతో పాటు, ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన 125 అడుగుల అంబేద్కర్ విగ్రహాన్ని రాష్ట్రంలో ఏర్పాటు చేసినట్లు చెప్పారు.భవిష్యత్తులో బీఆర్ఎస్ పార్టీ మళ్లీ అధికారంలోకి వస్తుందని, కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపడతారని ఆశాభావం వ్యక్తం చేశారు.అంబేద్కర్ ఆశయాలతో నవ సమాజ నిర్మాణానికి కృషి కొనసాగిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ మల్లికార్జున్ గౌడ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ అకిరెడ్డి.కృష్ణారెడ్డి, పట్టణ పార్టీ కన్వీనర్ కౌన్సిలర్ మామిళ్ల ఆంజనేయులు,న్యాయవాది జీవన్ రావు, మున్సిపల్ కౌన్సిలర్లు దీపక్ కుమార్,సంధ్య నవీన్, ఉదయ్ కుమార్,గౌస్,సోహెల్, జుబేర్ అహ్మద్, మహిళా నాయకురాలు అంకం.చంద్రకళ రాధ,నాయకులు, కిష్ట గౌడ్, అంజ గౌడ్, కిష్టయ్య, విశ్వం,లింగా రెడ్డి, ప్రభు రెడ్డి,కిషన్, మాయ. మల్లేశం, ఆర్కే శ్రీనివాస్, ఏనుగుల రాజు, సునీల్,రవి లక్ష్మీనారాయణ, దశరథం, ఇందాద్,సంతోష్ ,వెంకట్,ఆంజనేయులు,ప్రభాకర్, లక్ష్మణ్,కిషన్,మోహన్,ఇస్మాయిల్, రవి తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ జయంతి సందర్భంగా నివాళులు అర్పించిన



- **కొల్లూరి భరత్**

**రామచంద్రపురం, ఏప్రిల్ 14 (సిరి న్యూస్):**

అంబేద్కర్ జయంతి సందర్భంగా తెల్లాపూర్ మాజీ కౌన్సిలర్ కొల్లూరి భరత్ తెల్లాపూర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు అర్పించి వినమ్రంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా కొల్లూరి భరత్ మాట్లాడుతూ, భారత రాజ్యాంగ నిర్మాతగా డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ గారి సేవలు అపారమని తెలిపారు. సమానత్వం, సామాజిక న్యాయం కోసం ఆయన చేసిన పోరాటం చిరస్మరణీయమని పేర్కొన్నారు. పేదలు, బలహీన వర్గాల హక్కుల కోసం జీవితాంతం కృషి చేసిన మహనీయుడిని స్మరించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కుమార్ గౌడ్, మాజీ ఉపసర్పంచ్ కృష్ణ, ప్రభాకర్ రెడ్డి, ఎల్. రవీందర్, సుధాకర్ రెడ్డి, అంబేద్కర్ సంఘం నాయకులు, తెల్లాపూర్ మున్సిపాలిటీ ప్రజలు పాల్గొన్నారు.

## ఘనంగా జయంతి వేడుకలు

**తూప్రాన్ ఏప్రిల్ 14 సిరి న్యూస్**

తూప్రాన్ మున్సిపల్ వార్డుల లో మండల పరిధిలోని గ్రామాలలో మంగళవారం రోజు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు చిత్రపటానికి పూలమాలలు వేసి కొబ్బరికాయలు కొట్టి ఘనంగా నివాళులు అర్పించారు అధికారులు నాయకులు మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాణంలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ పాత్ర అందరికీ ఆదర్శప్రాయమని సమాజంలో సమానత్వం సామాజిక న్యాయంకోసం ఆయన చేసిన సాధనాలు సేవలు చిరస్మరణీయమని ఆయన ఆలోచనలు అన్ని వర్గాల వారికి యువతకు మార్గదర్శకంగా నిలవాలని వెనుకబడిన పేద మధ్యతరగతి వర్గాల అభ్యున్నతికి ఆయన చూపిన మార్గం ఆదర్శప్రాయమని తెలిపారుఈ కార్యక్రమంలో అధికారులు నాయకులు కార్యకర్తలు అన్ని శాఖల సిబ్బంది ప్రజలు పాల్గొన్నారు



# బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి డాక్టర్ అంబేద్కర్

- ఆయన అడుగు జాడలలో నడుస్తూ ఆ మహనీయుని ఆశయాలను కొనసాగిద్దాం
- ఘనంగా డాక్టర్ బీఆర్ అంబేద్కర్ 135వ జయంతి వేడుకలు
- నివాళులర్పించిన కలెక్టర్ ప్రతి మాసింగ్, ఎస్పీ డివి శ్రీనివాసరావు

**మెదక్ ఏప్రిల్,14(సిరిన్యూస్)**



బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి, భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ అడుగు జాడలలో నడుస్తూ ఆ మహనీయుని ఆశయాలను కొనసాగించాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్అ న్నారు.డాక్టర్ బీఆర్ అంబేద్కర్ 135 వ జయంతి వేడుకలను మంగళవారం మెదక్ జిల్లా కేంద్రంలో ఎస్సీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో రాందాస్ చౌరస్తాలో నిర్వహించగా, కలెక్టర్ ప్రతిమా సింగ్ , ఎస్పీ డీ.వి శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చిత్రపటానికి కలెక్టర్ పూలమాల వేసి నివాళులర్పిం చారు. కలెక్టర్ మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాత, షెడ్యూల్ కులముల మార్గదర్శకులు డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ ఆలోచనలు, ఆశయాలు స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. ప్రపంచంలో చిన్న చిన్న దేశాలు సాధించని స్వేచ్ఛ భారతదేశం సాధించిందంటే అది డాక్టర్ అంబేద్కర్ కృషి అన్నారు. అన్నిదేశాలనుండి స్వీకరించిన అంశాలతో రాజ్యాంగం రూపొందించడం జరిగిందని, మేధావుల ఆలోచనల వలననే మనం ఈ రోజు ప్రజాస్వామ్యంతో స్వేచ్ఛ, స్వతంత్ర్యాన్ని అనుభవిస్తూ ఆనందంగా జీవిస్తున్నామన్నారు. జిల్లా ఎస్పీ డివి శ్రీనివాసరావు మాట్లాడుతూ రాజ్యాంగం స్వేచ్ఛను,సమానత్వాన్ని ప్రసాదించిందని, సమాజంలో ప్రజలందరూ ఆనందంగా జీవించేందుకు రాజ్యాంగం దోహదపడిందన్నారు. ఈ కార్యక్రమంలో మెదక్ ఆర్డీఓ రమాదేవి, మున్సిపల్ వైస్ చైర్మన్ దొంతి నరేష్ గౌడ్ డీఎస్పీ ప్రసన్నకుమార్, జిల్లా రవాణా శాఖ అధికారి వెంకటస్వామి,ఎస్సీ కార్పొరేషన్ అధికారి డిఆర్డిఓ శ్రీనివాసరావు, జెడ్పి సీఈఓ ఎల్లయ్య, డి ఎఫ్ ఓ జో.జి, తాసిల్దార్ లక్ష్మణ్ బాబు, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, జిల్లా పరిశ్రమల అధికారి ప్రకాష్ రావు, అంబేద్కర్ ఉత్సవ కమిటీ గౌరవ అధ్యక్షులు ఆకుల పెంటయ్య, కమిటీ చైర్మన్ దుబాషి సంజీవ్ , వైస్ చైర్మన్ గరుగుల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి దుర్గాప్రసాద్, కార్యదర్శి నాగరాజు ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# అంబేద్కర్ జయంతి వేడుకలు

**కొల్చారం ఏప్రిల్ 14,(సిరి న్యూస్)**

డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 135 జయంతిని పురస్కరించుకొని కొల్చారం మండలం పరిధిలోని అన్ని గ్రామాలతో పాటు మండల కేంద్రమైన కొల్చారం వ్యాపార కేంద్రమైన రంగంపేట తదితర గ్రామాలలో అంబేద్కర్ 130 జయంతి వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు పార్టీలకు అతీతంగా కుల మతాలకు అతీతంగా ఊరేగింపు ద్విచక్ర వాహనాల ర్యాలీ అన్ని గ్రామాలలో ప్రధాన వీధిలో గుండా అంబేద్కర్ చేసిన సేవలను వక్తలు కొనియాడారు మండల కేంద్రమైన కొల్చారంలో దోమకొండ సత్యం వంశీ రాజి గారి కృష్ణ కృష్ణ తదితరుల ఆధ్వర్యంలో వేడుకలు కొల్చారం బస్టాండ్ అంబేద్కర్ విగ్రహం సాక్షిగా ఆయన చేసిన సేవలను కొనియాడారు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఏ ఒక్కరి ఆస్తి కాదని దేశవ్యాప్తంగా అందరికీ ఓటు హక్కును కలిగించిన వ్యక్తి అంబేద్కర్ ఆయన దేశానికి చేసిన సేవలను కొనియాడారు ఈ సందర్భంగా రోడ్డు ప్రమాదాల నేపథ్యంలో స్థానిక పోలీస్ ఆఫీసర్ జోగయ్య ఆధ్వర్యంలో రోడ్డు ప్రమాదాలు జరగకుండా ప్రత్యేక ప్రార్థన ప్రతిజ్ఞ నిర్వహించారు సీట్ బెల్ట్ పెట్టుకోవాలి హెల్మెట్ ధరించాలి ఎక్కువ రోడ్డు ప్రమాదాలు ద్విచక్ర వాహనాల వల్ల జరుగుతున్నాయని రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని అన్నారు రంగంపేటలో జైపాల్ ఆధ్వర్యంలో ఉప సర్పంచ్ సురేష్ అంబేద్కర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు కిష్టాపూర్ రాంపూర్ పోతంశెట్టిపల్లి అప్పాజీపల్లి తదితర గ్రామాలలో అంబేద్కర్ జయంతి వేడుకలు మహానేత చేసిన సేవలను కొనియాడారు ఈ కార్యక్రమంలోదోమకొండ సత్తయ్య, బొల్లి షేకులు, దోమకొండ సేకులు, , నీరుడి శివయ్య, దోమకొండ పాపయ్య, కొత్త యాదయ్య, దోమకొండ వినయ్, దోమకొండ సిద్దయ్య, బేకరీ సంజీవులు, అందుగులపల్లి ప్రభాకర్, చౌటకూరి శేఖర్, నిమ్మ గళ్ళ ఏగొండ, పోతా గళ్ళ అంజయ్య, వల్లే కృష్ణ, గడ్డం యాదగిరి, ఎర్రోళ్ల శ్రీను, రాజి గారి కృష్ణ బ్యాగరి కృష్ణ

# ఐలాపూర్ వివాదం మీడియా మీట్ లో కీలక అంశాలు

- కూల్చివేతలపై ప్రశ్నల వర్షం మీడియా ముందు ఆదర్శ్ రెడ్డి

**అమీన్ పూర్ ఏప్రిల్ 14 సిరి న్యూస్**



ఆమీన్ పూర్ సర్కిల్ పరిధిలోని ఐలాపూర్ గ్రామంలో మూడు రోజుల నుండి హైడ్రా కూల్చివేతలపై, మరియు కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలపై , బిఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ ఆదర్శ్ రెడ్డి తీవ్రంగా ఖండించారు.మంగళవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ... బిఆర్ఎస్ పార్టీ నాయకులు మాణిక్ యాదవ్ కు చెందిన బిఆర్ఎస్ పార్టీ కార్యాలయాన్ని ప్రభుత్వ భూమి పేరుతో అక్రమంగా కూల్చివేయడం అన్యాయమని ఆయన అన్నారు. 1954 నుండి వారి భూమి పూర్వీకుల సొంతమని ఆయన తెలిపారు. భూ భారతి, పోర్టల్ తో సహా అన్ని ఆధారాలు అతని వద్ద ఉన్నాయని హైడ్రా అధికారులకు తెలిపిన పట్టించుకోకుండా ఇష్టా రాజ్యంగా కూల్చివేతలు చేపట్టడం సిగ్గుచేటు అని అన్నారు. ప్రభుత్వం ఏటువంటి ముందస్తు నోటీసులు ఇవ్వకుండా ఈ విధంగా కూల్చివేతలకు పాల్పడడం ఏంటని ప్రశ్నించారు.సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు విరుద్ధమని ఆయన విమర్శించారు. కోర్టు ఆదేశాలు ఉన్నప్పటికీ బీఆర్ఎస్ నాయకులను లక్ష్యంగా చేసుకొని ఈ చర్యలు చేపడుతున్నారని ఆయన ఆరోపించారు. అలాగే మాణిక్ యాదవ్ కారును ధ్వంసం చేయడం, మరియు ఆర్వో ప్లాంటు ను కూల్చివేయడం సరైన పద్ధతి కాదు అని హెచ్చరించారు. అపార్ట్మెంట్లో ఉండే కిరాయి దారులను అరగంటలో ఖాళీ చేసి మీరు వెళ్లిపోవాలి, అని ఆర్డర్ వేసినహైడ్రా అధికారులు, ప్రజలకు నష్టం కలిగే విధంగా చర్యలు తీసుకున్నారని ఆయన విమర్శించారు.ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ తొంట అంజయ్య యాదవ్, మాజీ జెడ్పిటిసి కొలను బాల్రెడ్డి, కుమార్ గౌడ్, పరమేష్ యాదవ్, భాస్కర్, రాజు, శ్రీనివాస్ రెడ్డి, రాజు,బిఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు

# న్యాయ కోవిధుడు బి ఆర్ అంబేద్కర్

**మెదక్ఏప్రిల్,14(సిరిన్యూస్)**



స్వదేశీ జాగరణ మంచ్ మెదక్ శాఖ ఆధ్వర్యంలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ 135వ జయంతిని స్థానిక ఆచార్జీ ఐఐటీ అకాడమీలో ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి సీనియర్ అధ్యాపకులు బండి వెంకట్ ముఖ్య అతిథిగా విచ్చేసి డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ గొప్ప ఆర్థికవేత్త, న్యాయ కోవిదుడు అని, స్వతంత్ర భారతదేశానికి మొదటి న్యాయ శాఖ మంత్రిగా సేవలందించారని పేర్కొన్నారు. భారత రాజ్యాంగ నిర్మాణంలో ఆయన పాత్ర ఎంతో గొప్పదని తెలిపారు. దేశానికి చేసిన విశిష్ట సేవలకు గుర్తింపుగా భారత ప్రభుత్వం ఆయనను భారతరత్న పురస్కారంతో సత్కరించిందని అన్నారు.అలాగే విద్య ద్వారానే జ్ఞాన సముపార్జన సాధ్యమవుతుందని, జ్ఞానం ద్వారా దేశ అభివృద్ధి సాధ్యమవుతుందని ఆయన విద్యార్థులకు సూచించారు. డాక్టర్ అంబేద్కర్ ఆశయాలను యువత ఆదర్శంగా తీసుకొని సమాజ అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో స్వదేశీ జాగరణ మంచ్ రాష్ట్ర విచార ప్రముఖ్ డాక్టర్ నారాయణ గుప్తా, కో-కన్వీనర్ పతాంజలి విజయ్ కుమార్, సంపర్క్ ప్రముఖ్ మధుసూదన్ యాదవ్, ఆచార్జీ అకాడమీ డైరెక్టర్ ప్రవీణ్ కుమార్, అధ్యాపకులు బాలకృష్ణ, శ్రీకాంత్, అలాగే విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# సనాతన ధర్మాన్ని కాపాడుకుందాం

- హిందూ సమ్మేళన సభలో శ్రీ వీర ధర్మాజ పూజ్య పీఠాధిపతి




సనాతన ధర్మాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత హిందువులుగా మనకు పై ఉన్నదని శ్రీ వీర ధర్మజ పూజ్య స్వామీజీ పీఠాధిపతి పేర్కొన్నారు. మంగళవారం ఆర్ఎస్ఎస్ వందేళ్ల పూర్తి సందర్భంగా మాందాపూర్ పార్వతి పరమేశ్వర ప్రాంగణంలో హిందూ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత దేశ చరిత్ర ప్రపంచ దేశాల కన్నా వెయ్యిరెట్ల ధర్మానుసారం కలిగి ఉందని తెలిపారు వీరబ్రహ్మేంద్ర స్వామి కాలజ్ఞానం అనుసారమే యావత్ ప్రపంచం నడుస్తుందని వివరించారు. ఋషులు,మునులు, గ్రంథాలైన మహాభారతం, రామాయణం కథలు నిజ హాదారాలుగా గుర్తింపు పురాణాలు ఉన్నట్లు మనం చూస్తున్నామన్నారు. హిందువులకు ధర్మం అనుసారమే సంస్కృతి నడుస్తుందన్నారు. ప్రపంచ దేశాల కన్నా భారతదేశ సంస్కృతి ఇతర దేశాలు ఆచరిస్తున్నాయని గుర్తు చేశారు. ధర్మాన్ని రక్షించి అహింసను విడనాడాలని, వారానికోసారి కుటుంబ సభ్యులతో ఆలయాలకు వెళ్లి దేవుళ్లను దర్శించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గొల్లపల్లి, గుంతపల్లి, మునిదేవునిపల్లి చెర్ల గోపులారం, కోనాపూర్ మాందాపూర్ గంగారం, మారేపల్లి హిందూ బంధువులు పాల్గొన్నారు,

## పటాన్‌చెరులో అంబేద్కర్ జయంతి వేడుకలు

**రామచంద్రపురం, ఏప్రిల్ 14, (సిరి న్యూస్):**



పటాన్‌చెరులో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జయంతి సందర్భంగా ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాలకు సమాన హక్కులు సాధించడంలో అంబేద్కర్ చేసిన కృషి మరువలేనిదని తెలిపారు. యువత అంబేద్కర్ ఆశయాలను కొనసాగించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, దళిత సంఘాల నాయకులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## బీహెచ్ ఈఎల్ లో జాతీయ అగ్నిమాపక సేవా దినోత్సవం



**రామచంద్రాపురం, ఏప్రిల్ 14 (సిరి న్యూస్):**

హైదరాబాద్ ఆర్‌సీ పురంలోని బీహెచ్‌ఈఎల్‌లో సీఐఎస్ఎఫ్ యూనిట్ ఆధ్వర్యంలో జాతీయ అగ్నిమాపక సేవా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కమాండెంట్ సోను సింగ్ సికార్వార్ బీహెచ్‌ఈఎల్ ఫైర్ స్టేషన్‌లోని అమరవీరుల స్మారక స్తూపం వద్ద పుష్పాంజలి ఘటించి అమరవీరులకు ఘన నివాళులు అర్పించారు.అలాగే సంస్థ యాజమాన్యం మరియు సీఐఎస్ఎఫ్ సిబ్బంది 1944లో జరిగిన అగ్ని ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన అగ్నిమాపక సిబ్బందిని స్మరించుకున్నారు.ఫైర్ ఇన్‌స్పెక్టర్ బి.ఎస్. భండారి తెలిపిన మేరకు ప్రజల్లో అగ్నిమాపక భద్రతపై అవగాహన పెంపొందించేందుకు వారంపాటు అగ్ని భద్రత అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమాల్లో భాగంగా ఆసుపత్రులు, పాఠశాలల్లో మాక్ డ్రిల్లులు, విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు, వివిధ అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

## ఎస్ టి పి ప్లాంట్ రద్దుకు ఎమ్మెల్యే కు వినతి కాలుష్య భయం

### ట్రీట్మెంట్ ప్లాంట్ రద్దు చేయాలి



**అమీన్ పూర్ ఏప్రిల్ 14 సిరి న్యూస్**

అమీన్ పూర్ పీపుల్స్ అసోసియేషన్స్ ఆధ్వర్యంలో పటాన్ చేరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి-కి వినతి పత్రం అందజేత. నివాస ప్రాంతాల్లో ఎస్ టి పి ట్రీట్మెంట్ ప్లాంట్ నిర్మాణం రద్దు చేయాలని చుట్టుపక్కల కాలనీ ప్రజలు అందరు కలిసి ఎమ్మెల్యేను కలిశారు. అసోసియేషన్ అధ్యక్షులు తిరుమల్ రెడ్డి మాట్లాడుతూ.. ఎస్టిపి సివరేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్ నిర్మాణాన్ని తక్షణమే నిలిపివేయాలని ఆయన డిమాండ్ చేశారు. ప్లాంట్ వల్ల కాలుష్య సమస్యలు తలెత్తే అవకాశం ఉందని, మరియు పరిసర ప్రాంత ప్రజల ఆరోగ్యం పై ప్రభావం ఉంటుందని ఆయన తెలిపారు. ప్రజల అభిప్రాయం తీసుకోకుండా పనులు ప్రారంభం చేయొద్దని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో విష్ణు, కేశవ్ ,శివ, ఈశ్వర్ ,మహిళలు ,తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ

- ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్




**వెల్దుర్తి, ఏప్రిల్ 14 (సిరి న్యూస్):**

వెల్దుర్తి మండలం శేరిలా గ్రామంలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 135వ జయంతిని పురస్కరించుకుని అంబేద్కర్ విగ్రహాన్ని అంగరంగ వైభవంగా ఆవిష్కరించారు. గ్రామంలో జైభీమ్ నినాదాలు మార్మోగుతూ వేడుకలు ఉత్సాహంగా కొనసాగాయి.ఈ కార్యక్రమంలో విగ్రహ దాత, టిపిసిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవుల రాజిరెడ్డి , డిసిసి అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్, తూప్రాన్ డిఎస్పి నరేందర్ గౌడ్, సీఐ రంగాకృష్ణ, పాల్గొని విగ్రహాన్ని ఆవిష్కరించి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కి ఘన నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ... అంబేద్కర్ సమానత్వం, హక్కులు, సామాజిక న్యాయం కోసం చేసిన కృషి దేశానికి మార్గదర్శకంగా నిలిచిందని పేర్కొన్నారు. అణగారిన వర్గాల హక్కుల కోసం నిరంతరం పోరాడిన మహానీయుడిగా ఆయనను కొనియాడారు. ఆయన చూపిన మార్గాన్ని ప్రతి ఒక్కరూ అనుసరించి సమానత్వ సమాజ నిర్మాణానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ వేడుకల్లో గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్, మండల నాయకులు,గ్రామ ప్రజలు, యువత, నాయకులు పెద్ద ఎత్తున పాల్గొని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు సమర్పిస్తూ ఘనంగా నివాళులు అర్పించారు.

## ఆదర్శప్రాయుడు అంబేద్కర్

**బీజేపీ పార్టీ మండల అధ్యక్షుడు శ్రీకాంత్ రెడ్డి**



(సిరి న్యూస్)

మండల పరిధిలో మందాపుర్ లో మంగళవారం భారత రాజ్యాంగ నిర్మాత, భారత రత్న డా"బి ఆర్ అంబేద్కర్ జయంతిని బీజేపీ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాత, సంఘ సంస్కర్త, భారతరత్న డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ 135వ జయంతి ఘన నివాళి తెలిపారు.అంటరానితనంతో కులవివక్షకు గురైన ఉన్నత విద్యను అభ్యసించి దేశం గర్వించే అత్యున్నత స్థాయికి ఎదిగిన అంబేద్కర్ ఆదర్శప్రాయులు. ప్రపంచంలో బలమైన ప్రజాస్వామ్య దేశంగా మన దేశం నిలిచిందాన్నారు. రాజ్యాంగం. సమాన అవకాశాలు, హక్కులు, ప్రతి పౌరుడికి రాజ్యాంగ రక్షణ కల్పించారన్నారు. అంబేద్కర్ ఆశయ సాధనే మన లక్ష్యంగా, ప్రజాస్వామ్యాన్ని గౌరవిస్తూ, బాధ్యత కలిగిన పౌరుడిగా ఉండడమే ఆ మహనీయునికి మనం ఇచ్చే ఘన నివాళి అని అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు యెల్లయ్య, జిల్లా సీనియర్ నాయకులు హన్మంత్ రెడ్డి,రాజేందర్ రెడ్డి, గ్రామ ఉపసర్పంచ్ విద్య సాగర్, నాయకులు కృష్ణ గౌడ్,శివ,మల్లా రెడ్డి,మధు గౌడ్, బూత్ అధ్యక్షులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## రోడ్డు భద్రతలు పాటించాలి

**సిఐ సుమన్ కుమార్**



ఏప్రిల్,14(సిరిన్యూస్)

రోడ్డు భద్రత పాటించి వాహనాలు నడిపించాలని సిఐ సుమన్ కుమార్ పేర్కొన్నారు. మంగళవారం ప్రజాపాలన ప్రగతి ప్రాణాలికల "అరైవ్ –అలైవ్" కార్యక్రమాన్ని మల్కాపూర్, గొల్లపల్లి, మునిదేవునిపల్లి నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ సుమన్ కుమార్ మాట్లాడుతూ రహదారులపై భద్రత నియమాలు పాటించి గమ్యస్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. రహదారులు దెబ్బతినేలా వాహనాలను నడిపిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వాహనాలు నడిపేటప్పుడు సూచ తప్పకుండా ప్రమాణాలను పాటించాలన్నారు. రోడ్డు భద్రతలపై గ్రామస్తులకు అవగాహన కల్పించి, జాగ్రత్తగా పై ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై సోమేశ్వరి గ్రామ సర్పంచులు అనిల్, శ్రీనివాస్ గౌడ్, కృష్ణ, గ్రామ పాలక సభ్యులు, గ్రామస్తులు ఉన్నారు.

## మహనీయుడికి... ఘన నివాళి



ఝరాసంఘం, ఏప్రిల్ 14(సిరిన్యూస్)

భారత రాజ్యాంగ శిల్పి, భారతరత్న డాక్టర్ భీమ్రావ్ రాంజీ అంబేద్కర్ 135వ జయంతిని పురస్కరించుకుని నేడు ఝరాసంఘం మండలంలో పండుగ వాతావరణం నెలకొంది. సామాజిక సమానత్వం కోసం ఆయన చేసిన పోరాటాన్ని స్మరిస్తూ ప్రతి గ్రామంలో ఘనంగా నివాళులు అర్పించారు. బడుగు బలహీన వర్గాల కొరకు ఆయన చేసిన సేవ మరువలేనిది.అంబేద్కర్ జయంతి కేవలం ఒక పుట్టినరోజు వేడుక మాత్రమే కాదు, అది సామాజిక విప్లవానికి ఒక స్ఫూర్తి. ఆయన ఆశయాల సాధనలో ప్రతి పౌరుడు భాగస్వామి కావాలి అప్పుడే ఆ మహనీయుడికి మనమిచ్చే అసలైన నివాళి. ఈ దేశంలో పుట్టిన ప్రతిపౌరుడికి సమానమైన హక్కులను కల్పించి, ప్రజలలో మనమంతా ఒక్కటే అనే భావాని కలిగించాడు. స్వతంత్ర భారతదేశానికి మొట్టమొదటి న్యాయ శాఖ మంత్రిగా పదవి చేపట్టారు అందుకే ఈ రోజును సామాజిక న్యాయ దినోత్సవంగా కూడా జరుపుకుంటారు .తన జీవితాంతం సామాజిక మార్పు కోసం పోరాడిన ఆయన, మనుషుల మధ్య విభేదాలు లేని సమాజం కోసం 1956లో లక్షలాది మంది అనుచరులతో కలిసి బౌద్ధ మతాన్ని స్వీకరించారు.మహిళ హక్కుల కోసం ఏర్పాటు చేసిన బిల్లుకు వ్యతిరేకత రావడంతో తన మంత్రి పదవిని వదిలేసి మహిళల పట్ల నిబద్ధత చాటుకున్న మహనీయుడు అంబేద్కర్.

## 18 న రామాయంపేట లో జాబ్ మేళా...

- **ప్రిన్సిపాల్ హిమ జ్యోతి..**



రామాయంపేట, ఏప్రిల్ 14(సిరి న్యూస్ )

రామాయంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈ నెల 18న జాబ్ మేళా నిర్వహించడం జరుగుతుందని కళాశాల ప్రిన్సిపాల్ హిమ జ్యోతి తెలిపారు. ఎం ఎస్ ఎన్ కెమికల్ పరిశ్రమకు చెందిన ప్రతినిధుల ఆధ్వర్యంలో జాబ్ మేళా కొనసాగు తుందని చెప్పారు. ఇంటర్మీడియట్ ఎంపీసీ, బైపీసీ ,ఒకేషనల్ ఎం ఎల్ టి కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులు ఇట్టి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కళాశాలలో ఉదయం పది గంటల నుండి మధ్యాహ్నం మూడు గంటల వరకు జాబ్ మేళా కొనసాగుతుందన్నారు. అట్టి విద్యార్థులు ఒరిజినల్ సర్టిఫి కెట్లతో హాజరు కావాలని ఆమె సూచించారు .ఎంపికైన విద్యార్థులకు ఆకర్షణీయమైన వేతనం కంపెనీ ఆధ్వర్యంలో చెల్లించడం జరుగుతుందన్నారు. 17 సంవత్సరాల నుండి 21 సంవత్సరాల లోపు ఉన్న విద్యార్థులు ఇట్టి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు.

# అంబేద్కర్ చూపిన మార్గం అందరికి ఆదర్శం





- **నిజాంపేట రామయంపేట మండలాల్లో అంబేద్కర్ కు నివాళి.**
- **రామాయంపేట మున్సిపల్ చైర్మన్ గజవాడ లావణ్య నాగరాజు గుప్త.**

రామాయంపేట ఏప్రిల్ 14(సిరి న్యూస్)

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ 135 వ జయంతి సందర్భంగా మెదక్ జిల్లా రామాయంపేట పట్టణంలో మంగళవారం ఘనంగా వేడుకలు నిర్వహించారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ అందరి వ్యక్తి కావడంతో పార్టీలకు అతీతంగా నాయ కులు యువజన సంఘాల నాయ కులు కార్యకర్తలు ఎవరికి వారు ఆయనకు ఘనంగా నివాళులు అర్పించారు. మెదక్ చౌరస్తా వద్ద అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో అధికార కాంగ్రెస్ పార్టీ, టిఆర్ఎస్, బిజెపి, బీసీ సంఘం, ఎమ్మార్పీఎస్, పలు ఉపాధ్యాయ సంఘాల వారు ఆయనకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా మున్సిపల్ చైర్ పర్సన్ లావణ్య నాగరాజు మాట్లాడుతూ డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ దూరదృష్టి వల్లే భారతదేశం ప్రజాస్వామ్య దేశంగా అభివృద్ధి చెందిందని పేర్కొన్నారు. సమాజంలో ప్రతి ఒక్కరికీ సమాన హక్కులు కల్పించేందుకు ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని అన్నారు. విద్య ద్వారానే ఉన్నత స్థాయికి చేరుకో వచ్చని, విద్యార్థులు కృషి చేసి జీవితంలో ఉన్నత స్థానాలకు ఎదగాలని సూచించారు. యువత అంబేద్కర్ చూపిన మార్గంలో నడుచుకుని రాజ్యాంగ విలువ లను ఆచరణలో పెట్టాలని, సమ సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అనంతరం మాజీ మున్సిపల్ చైర్మన్ పల్లె జితేందర్ గౌడ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సరాపు యాదగిరి, పార్టీ నాయకుడు చౌదరి సుప్ర భాతారావు మాట్లాడుతూ డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ భారత రాజ్యాంగ రూపకర్తగా, సామాజిక న్యాయం కోసం పోరాడిన మహా నుభావుడిగా చిరస్మరణీయుడని అన్నారు. భారత రాజ్యాంగం గొప్పదని, యువత చదువుపై దృష్టి సారిస్తూ సమాజంలో మంచి పౌరులుగా ఎదగాలని సూచించారు. ధైర్యం, నమ్మకం తో ముందుకు సాగితే వారి భవిష్యత్తు మాత్రమే కాక దేశ ప్రగతికి కూడా తోడ్పడు తుందని తెలిపారు. జిల్లా బీసీ సంఘం గౌర వాధ్యక్షుడు మెట్టు గంగారాం మా ట్లాడుతూ అంబేద్కర్ ఆశయాలు సమా నత్వం, విద్య, స్వాభిమానం అనే విలువలపై ఆధారపడి ఉన్నాయని పేర్కొ న్నారు. ప్రతి ఒక్కరూ ఆ ఆశయా లను ఆచరణలో పెట్టి సమాజాభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్ర మంలో వైస్ చైర్ పర్సన్ పోచమ్మల నవనీత గణేష్,కౌన్సిలర్ లు దేవుని రంజిత్, రవి నాయక్, పుట్టి సందీప్, బైరం స్వప్న కుమార్, దాకి శ్యామల స్వామి, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు దేమే యాదగిరి, చింతల యాదగిరి, కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి పోచమ్మల గణేష్,పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చింతల స్వామి, కాంగ్రెస్ పార్టీ నాయకులు విప్లవ కుమార్, ఎమ్మెల్యే పర్సనల్ సెక్రెటరీ రంగ రాజ కిషన్, జిల్లా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ అధ్యక్షుడు ఏలేటి రాజశేఖర్ రెడ్డి, బైరం కుమార్, దాకి స్వామి, బుర్ర అనిల్, టిఆర్ఎస్ కౌన్సిలర్ లు చౌదరి చరిత, మద్దెల మాధవి రమేష్, కొక్కు ప్రవీణ్, సహకార సంఘం మాజీ చైర్మన్ బాదే చంద్రం, యూత్ విభాగం అధ్యక్షులు రొయ్యల నవీన్,ఎస్.కె హైమద్, బిజెపి పట్టణ అధ్యక్షులు అవినాష్ రెడ్డి, పబ్బ సత్యనారాయణ, దోమకొండ రాములు, చింతల శేఖర్, mrps నాయకులు పా తూరి రాజు, లద్ద నర్సింలు, మాసాయి పేట మల్లేశంతో పాటు వివిధ కుల సంఘాల ప్రతినిధులు, ఉద్యోగ సంఘాల ప్రతినిధులు, యువత, విద్యార్థులు, ప్రజలు పాల్గొన్నారు.

# సామాజిక న్యాయం అంబేద్కర్ చూపిన మార్గం

- **జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్**

మెదక్ ఏప్రిల్,14(సిరిన్యూస్)



భారతరత్న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ గారి 135వ జయంతి సందర్భంగా మంగళవారం మెదక్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్,జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు ,అదనపు కలెక్టర్ నగేష్ లు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ..డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సామాజిక న్యాయం, సమానత్వం, హక్కుల పరిరక్షణ కోసం చూపిన మార్గం ప్రతి ఒక్కరికి ఆదర్శప్రాయమని తెలిపారు. భారత రాజ్యాంగ రూపకర్తగా దేశ నిర్మాణంలో ఆయన చేసిన అపార సేవలను స్మరించుకున్నారు.సమాజంలోని అణగారిన వర్గాల అభ్యున్నతికి ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు, విద్యా,ఉపాధి అవకాశాలు అంబేద్కర్ ఆశయాల స్ఫూర్తితోనే కొనసాగుతున్నాయని తెలిపారు. యువత అంబేద్కర్ ఆశయాల స్ఫూర్తితో సమాజ అభివృద్ధికి తోడ్పడాలని పిలుపునిచ్చారు.జిల్లా ఎస్పీ శ్రీనివా సరావు మాట్లాడుతూ.. అంబేద్కర్ ఆదర్శప్రాయుడని, అంబేద్కర్ జీవితంలో ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొన్ని ఉన్నత స్థాయిలో ఎదిగారని అందరికీ ఆదర్శప్రాయుడు అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ నగేష్, జెడ్పి సీఈఓ ఎల్లయ్య,డిఆర్డిఓ శ్రీనివాసరావు, డీఎఫ్ఓ జోజి,ము న్సిపల్ చైర్మన్ కనుగుల రాధిక భూపతి రాజ్,ఆర్డీవో రమాదేవి ,టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు నరేందర్,రాజ్ కుమార్, కమిటీ గౌరవ అధ్యక్షులు ఆకుల పెంటయ్య, ఉత్సవాల కమిటీ చైర్మన్ దుబాషి సంజీవ్, వైస్ చైర్మన్ గరుగుల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి దుర్గ ప్రసాద్, కదారి నాగరాజు,పాతూరి రాజు,సంజీవ, ముర ళీ, మైస య్య, శ్యామిల్, బాల రాజు, అ శోక్, యాదగిరి,సురేష్,సంగమేశ్వర్,బలరాం తదితరులు పాల్గొన్నారు.

# అతివేగం.. అజాగ్రత్తతోనే రోడ్డు ప్రమాదాలు

- **తూప్రాన్ డీఎస్పి నరేందర్ గౌడ్**
- **శేరీల గ్రామం లో అరైవ్ అలైవ్ కార్యక్రమం**

వెల్దుర్తి,ఏప్రిల్14,(సిరి న్యూస్):




అతివేగం, అజాగ్రత్త, కాస్త ఏమరపాటు వల్లే రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, ఈ ప్రమాదాలలో ముఖ్యంగా యువత ప్రమాదాల బారిన పడి ప్రాణాలు కోల్పో తున్నారని తూప్రాన్ డీఎస్పి పేర్కొన్నారు. ఈ కార్యక్ర మానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్, నర్సాపూర్ ఇన్చార్జ్ ఆవుల రాజిరెడ్డి, తూప్రాన్ సీఐ రంగా కృష్ణ, తదితర మండల నాయకులతో కలిసి వెల్దుర్తి మండల పరిధిలోని చేరిలా లో రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా ప్రభుత్వ ఆదేశాల మేరకు పోలీస్, ఆధ్వర్యంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా అరైవ్ అలైవ్ కార్యక్రమం ద్వారా వాహనదా రులకు, ప్రజలకు రోడ్డు భద్రత నియమాలు, నిబంధనల పై అవగాహన కల్పిం చారు. కార్యక్రమానికి మహిళలు, వాహ నదారులు భారీ ఎత్తున తరలివచ్చి అవగాహన సదస్సులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీఎస్పీ నరేందర్ గౌడ్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించడం వల్ల ప్రాణాలకు రక్షణ కవచంల ఉంటుందన్నారు. కారులో సీటు బెల్టు ధరించాలన్నారు. పోలీసుల జరిమానా విధిస్తారని హెల్మెట్ ధరించడం కాదు.. మీ ప్రాణాలు కాపాడుకోవడం కోసమ న్నారు. ఎవరికి వాళ్లు స్వతహాగా నియమాలు పాటిస్తే రోడ్డు ప్రమాదాల ను తగ్గించవచ్చన్నారు. ప్రమాదాలు ఎక్కువగా నిర్లక్ష్యం, అతివేగం, మద్యం సేవించి వాహనాలు నడపడం, సెల్ ఫోన్, మైనర్లు డ్రైవింగ్, ఓవర్ టేకింగ్, టర్నింగ్ పాయింట్ వద్ద క్రాసింగ్ లు చేయడంవల్ల ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు , స్థానిక ఎస్సై రాజు, ఆయా పార్టీల నాయకులు పాల్గొన్నారు.

# అణగారిన వర్గాల ఆరాధ్య దైవం అంబేద్కర్.!!

**గొల్లపల్లి సర్పంచ్ శ్రీనివాస్ గౌడ్..**

ఏప్రిల్ 14(సిరిన్యూస్)



బి.ఆర్ అంబేద్కర్ 135 వ జయంతిని పురస్కరించుకొని గొల్లపల్లి సర్పంచ్ శ్రీనివాస్ గౌడ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల ఆరాధ్య దైవం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అన్నారు.సమాజంలో ఎన్నో అవమానాలు భరించి చదువు అనే జ్ఞానంతోనే సమాజంలో గుర్తింపు టుందని భావించి ఉన్నత చదువులు చదివి ప్రపంచంలోనే అత్యధిక డిగ్రీలు పొందిన మహనీయుడని ప్రపంచ జ్ఞాని అని కొనియాడారు. కొన్ని సందర్భాల్లో విద్య నేర్పిన గురువుల చేతనే ఎన్నో అవమానాలకు గురై, చిన్ననాటి నుంచి ఎంతో బాధపడుతూ సమాజానికి ఏదైనా చేయాలని, అంటరా నితనాన్ని పూర్తిగా నిర్మూలిం చాలని,జరిగే అవమానాలు ఇక ముందు ఎవ్వరికీ జరగకూడదని భావించి నిరంతర కృషి,పట్టుదలతో ఉన్నత శిఖరాలను అధిరోహించి దేశానికి మొట్టమొదటి న్యాయశాఖ మంత్రి గా సేవలందించిన గొప్పవ్య నుడు అంబేద్కర్ అని ఆయన కొనియాడారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు..

# న్యాయమైన డిమాండ్ లను అమలు చేయాలి

- విద్యుత్ ఆర్టిజన్ కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలి..
- ఆర్టిజన్ సమ్మెకు మాజీ డిప్యూటీ స్పీకర్ యం.పద్మ దేవేందర్ రెడ్డి మద్దతు

**మెదక్ ఏప్రిల్,14(సిరిన్యూస్)**




విద్యుత్ ఆర్టిజెన్స్ కార్మికుల న్యాయమైన డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్క రించాలని మాజీ డిప్యూటీ స్పీకర్, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు ఎం. పద్మ దేవేందర్ రెడ్డి డిమాండ్ చేశారు.మెదక్ జిల్లాలో గత 7 రోజులుగా కొనసాగుతున్న ఆర్టిజన్ కార్మికుల సమ్మెలో పాల్గొని బీఆర్ఎస్ పార్టీ తరఫున కార్మికులకు మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని, విద్యుత్ కార్మికుల సమస్య లను ఆలస్యం చేయకుండా పరిష్కరించాలని కోరారు. ఇప్పటికే వారం రోజులుగా సమ్మె కొనసాగు తున్నప్పటికీ ప్రభుత్వం స్పందించకపోవడం శోచనీయమన్నారు. కార్మికులు ఏపీఎస్ఈబీ నిబంధనలను యథాతథంగా అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ప్రభుత్వం వెంటనే కార్మికులతో చర్చలు జరిపి సమ స్యలకు పరిష్కారం చూపాలని, లేనిప క్షంలో బీఆర్ఎస్ పార్టీ తరఫున కార్మికులకు అండగా నిలిచి పోరాటం కొనసాగిస్తామని హెచ్చరించారు. రాష్ట్రానికి విద్యుత్ రంగం కీలకమని పేర్కొంటూ, విద్యుత్ శాఖ మంత్రి బట్టి విక్రమార్క గారు వెంటనే స్పందించి కార్మికులను చర్చలకు ఆహ్వానించాలని కోరారు.రాష్ట్రంలో ప్రస్తుత పాలనపై విమర్శలు గుప్పించిన ఆమె, విద్యుత్ కార్మికులు ఐక్యంగా పోరాటం చేయాల న్నారు.ఈ కార్యకర్తమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ మల్లికార్జున్ గౌడ్, పట్టణ పార్టీ కన్వీనర్ కౌన్సిలర్ మామిళ్ల ఆంజనే యులు,న్యాయవాది జీవన్ రావు,మున్సిపల్ కౌన్సిలర్లు దీపక్ కుమార్, జుబెర్ అహ్మద్, ఉదయ్ కుమార్,మెదక్ మండల పార్టీ అధ్యక్షులు యం. అంజ గౌడ్, నాయకులు పూసల సంతోష్ సునీల్,ఇందాద్ మోహన్, మహిళా నాయ కురాలు చంద్రకళ, రాధ , విద్యుత్ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా అంబేద్కర్ జయంతి వేడుకలు

**గుమ్మడిదల, ఏప్రిల్ 14( సిరి న్యూస్):**

గుమ్మడిదల మండలంలో డా. బి.ఆర్. అంబేద్కర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. గుమ్మడిదల, అనంతారం గ్రామంలోని ఎస్సీ కాలనీలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం పాలాభిషేకం నిర్వహించి ఆయన సేవలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ కొమ్ము శ్రీనివాస్ మాట్లాడుతూ అంబేద్కర్ సమాజంలో సమానత్వం, న్యాయం కోసం చేసిన కృషి అపారమని పేర్కొన్నారు. భారత రాజ్యాంగ నిర్మా ణంలో ఆయన చేసిన సేవలు దేశానికి చిరస్థాయిగా నిలిచిపోయాయని అన్నారు. ప్రతి ఒక్కరూ ఆయన చూపిన మార్గంలో నడుచుకుంటూ సమాజ అభివృద్ధికి కృషి చేయాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు రామగల రాములు, మలగళ్ళ నారాయణ, చింది ప్రభాకర్, రామగాళ్ళ అశోక్, రమగల్ల మహేష్, కొమ్ము ప్రవీణ్, కుమ్మదాసు, బుజ్జిగల వెంకటయ్య, చెంది మల్లేష్, రమగాళ్ళ బాలసాయిలు పాల్గొన్నారు. ఎస్సీ కాలనీ అభివృద్ధి కమిటీ చైర్మన్ కొమ్ము నరసింహులు, రామగల్లా విజయ్ తదితరులు హాజరై అంబేద్కర్ నివాళులు అర్పించారు.



# రాజ్యాంగం కల్పించిన హక్కులను ప్రజలు వినియోగించుకోవాలి

- రామాయంపేట ఎస్సై బాలరాజు.

**రామాయంపేట, ఏప్రిల్ 14(సిరి న్యూస్ )**



మెదక్ జిల్లా రామాయంపేట మండలం కాట్రియాల గ్రామంలో మంగళవారం రాజ్యాంగ సృష్టికర్త, డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. 135వ జయంతి పురస్కరించుకొని ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఎస్సై బాలరాజు, స్థానిక సర్పంచ్ స్రవంతి రాజేందర్ గుప్తా ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం అరైవ్ – అలైవ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. రోడ్డు భద్రతపై ప్రతిజ్ఞ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాజ్యాంగం కల్పించిన హక్కులను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు, డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగం వల్లనే తాను ఎస్ఐ పదవిలో కొనసాగుతున్నానని ఎస్ఐ బాలరాజు తెలిపారు. అన్ని వర్గాల అభివృద్ధి, సంక్షేమం కోసం ఎంతో ముందు చూపుతో డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ రాజ్యాంగం రచించారని పేర్కొన్నారు. రాజ్యాంగ హక్కులు అందరికీ కల్పించే విధంగా ప్రతి ఒక్కరు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్సై బాలరాజు, సర్పంచ్ కొత్త స్రవంతి రాజేందర్ గుప్తా, ఉప సర్పంచ్ బాబు నాయక్, గ్రామ కార్యదర్శి ధనలక్ష్మి ,వార్డు సభ్యులు బిల్లం మల్లారెడ్డి, మనవ, సందీప్ కుమార్, మైలారం బాబు, భారతి, శని శెట్టి సందీప్ కుమార్ గుప్తా, మైలారం లావణ్య, కాట్రియాల రిబుక, మైలారం శ్యామల, మాజీ సర్పంచ్ మైలారం శ్యామ్, బిక్షపతి, కట్ట డాక్టర్ చంద్రం,అంబేద్కర్ యూత్ అధ్యక్షుడు మైలారం బాబు, ఉపాధ్యక్షులు కమల్, రాగిశెట్టి ప్రశాంత్, క్యాషియర్ మైలారం శ్రీధర్, రాజు, భాను, శ్రీకాంత్,స్వామి, రవి కిషన్,తదితరులు పాల్గొన్నారు

# హక్కుల కోసం అంబేద్కర్ పోరాటం స్ఫూర్తిదాయకం

- ఘనంగా అంబేద్కర్ 135వ జయంతి వేడుకలు
- యువత ఆయన ఆశయాలను ఆచరణలో పెట్టాలి
- చైర్మన్ కుమార్ గౌడ్

**గుమ్మడిదల, ఏప్రిల్ 14 (సిరి న్యూస్):**



సమాన హక్కుల కోసం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ చేసిన పోరాటం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని గుమ్మడిదల మున్సిపల్ చైర్మన్ చిన్నపాపని కుమార్ గౌడ్ అన్నారు. మంగళవారం గుమ్మడిదల మున్సిపల్ కార్యాలయంలో అంబేద్కర్ 135వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ మున్సిపల్ కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మున్సిపల్ పరిధిలోని పలు గ్రామాల్లో నిర్వహించిన జయంతి కార్యక్రమాలకు హాజరై అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అంబేద్కర్ సంఘ అధ్యక్షుడు తుడుం రవి ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక రక్తదాన శిబిరాన్ని సందర్శించిన ఆయన, సంఘం సభ్యులు చేపడుతున్న సామాజిక చైతన్య కార్యక్రమాలను కొనియాడారు. అంబేద్కర్ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్తున్న తీరును అభి నందనీయమని పేర్కొన్నారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ సమాజంలోని అసమానతలను తొలగించి అందరికీ సమాన హక్కులు కల్పించేందుకు అంబేద్కర్ చేసిన కృషి అపారమని చెప్పారు. దళిత బహుజనుల అభ్యున్నతికి ఆయన చేసిన సేవలను స్మరించుకుంటూ, ప్రతి ఒక్కరూ ఆయన ఆశయ సాధన కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా యువత అంబేద్కర్‌ను స్ఫూర్తిగా తీసుకుని ఉన్నత స్థాయికి చేరాలని సూచించారు. ఈ కార్యక్రమాల్లో కమిషనర్ దశరథ, తహసిల్దార్ పరమేశం, వైస్ చైర్మన్ చిమ్ముల సంధ్య, వార్డు కౌన్సిలర్లు సరెడ్డి గారి పద్మ , అభిశెట్టి రాజశేఖర్, గోకర్ నిర్మల, మేడిపల్లి మురళి, తుపాకుల రాధిక, ఆర్ల కిషన్, బెంబడి సంజీవరెడ్డి, మద్ది సోనీ, షేక్ గౌసియా, ఆకుల మాధవి, మూడు చింతల నరేందర్ రెడ్డి, కత్తుల రమేష్, పొన్నాల ప్రమీల రెడ్డి, సద్ది జైపాల్ రెడ్డి, సురభి కుమార్ గౌడ్, నర్సంపల్లి రాజిరెడ్డి, బ్యాగరి వరలక్ష్మి , గిద్దె విజయలక్ష్మి , శ్రీ చూర్ణం చక్రపాణి, చప్పటి పద్మ, బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు గోవర్ధన్ రెడ్డి, అంబేద్కర్ సంఘాల ప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, యువజన సంఘాల సభ్యులు, ప్రజలు పాల్గొన్నారు.

# ఇస్మాయిల్ ఖాన్ పేటలో ఘనంగా అంబేడ్కర్ జయంతి

- యువజన సంఘం ఆధ్వర్యంలో ర్యాలీ, జెండా ఆవిష్కరణ
- పాల్గొన్న ప్రజాప్రతినిధులు, స్థానిక నేతలు

**సంగారెడ్డి, ఏప్రిల్ 14 (సిరి న్యూస్):**



భారత రాజ్యాంగ శిల్పి, దేశ తొలి న్యాయశాఖ మంత్రి, భారత రత్న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ 135వ జయంతి సందర్భంగా ఇస్మాయిల్ ఖాన్ పేట గ్రామంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు జంగిలి శంకర్ నేతృత్వంలో జెండా ఆవిష్క రణతో కార్యక్రమం ప్రారంభమైంది. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించి అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు సమర్పించి సభ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బక్క మంజుల బలరాం, ఉపసర్పంచ్ స్మిత శ్రీధర్, వార్డు సభ్యులు పాల్గొన్నారు. అలాగే కాసుల నరసింహ రామ శర్మ, అంగడిపేట వీరేశం ప్రసంగిస్తూ అంబేద్కర్ బాల్యంలో ఎదుర్కొన్న కష్టాలు, రాజ్యాంగ రచనలో ఆయన చూపిన కృషి, అకుంఠిత దీక్షను గుర్తుచేశారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ మనోహర్, మాజీ సర్పంచ్ గోనెల రఘు, మోహనరావు, జంగిలి లక్ష్మీనారాయణ, అంజయ్య, గోవర్ధన్, దుర్గాప్రసాద్, ఆంజనేయులు, బత్తినీ కృష్ణ, విజయ్, శంకర్, నాగేష్, విష్ణువర్ధన్, లక్ష్మణ్‌తో పాటు ఈశ్వరపుర హిందూ ఉత్సవ సమితి సభ్యులు, గ్రామస్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ఇండ్ల లెక్కింపు ప్రక్రియను పరిశీలిస్తున్న తహసిల్దార్



**వెల్దుర్తి, ఏప్రిల్ 14 (సిరి న్యూస్):**

సెన్సెస్ 2027 నేపథ్యంలో ఇండ్ల లెక్కింపు ప్రక్రియను వేగవంతం చేసే దిశగా అధికారులు చర్యలు చేపడుతున్నారు. డైరెక్టర్ ఆఫ్ సెన్సెస్ ఆపరేషన్స్, తెలంగాణతో పాటు మెదక్ జిల్లా కలెక్టర్ సూచనల మేరకు ఈ కార్యక్రమం ముందుకు సాగుతోంది.మండల కేంద్రం వెల్దుర్తిలో తహశీల్దార్ (చార్జ్ ఆఫీసర్) శ్రీనివాస్ నేతృత్వంలో గ్రామంలోని ప్రధాన కూడళ్లను పరిశీలిస్తూ గణన పనుల అమలును సమీక్షించారు.సర్వే పనులు సక్రమంగా సాగేందుకు గ్రామాన్ని బ్లాకులుగా విభజించి, ప్రతి బ్లాక్‌కు విడిగా నక్షాలను రూపొందిస్తున్నారు. గ్రామ జనాభా ఆధారంగా ఒక్కో ఎన్యూమరేటర్‌కు 600–800 మంది వరకు కేటాయించేలా ప్లానింగ్ చేశారు.ఈ గణన ప్రక్రియలో 59 మంది ఎన్యూమరేటర్లు, 10 మంది సూపర్వైజర్లు పాల్గొని పనులను పద్ధతిగా నిర్వహించనున్నట్లు తహశీల్దార్ శ్రీనివాస్ తెలిపారు.

# 4 వ దశ రోడ్డు భద్రత

**తూప్రాన్ ఏప్రిల్ 14 సిరి న్యూస్ సిరి న్యూస్**



తూప్రాన్ మున్సిపల్ పట్టణంలోని బస్టాండ్ వద్ద మంగళవారం రోజు డాక్టర్ బి ఆర్ .అంబేద్కర్ జయంతి సందర్భంగా 4 వ దశ ఆరైవ్ ఆలైవ్ కార్యక్రమంలో భాగంగా రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమం నిర్వహించారు తూప్రాన్ డీఎస్పీ నరేందర్ గౌడ్ మాట్లాడుతూ రోడ్డు భద్రత నియమాలు ప్రమాదాల నివారణ బాధ్యతాయుత డ్రైవింగ్ లైసెన్స్ లు వాహనానికి సంబంధించి ఇన్సూరెన్స్ లు తప్పనిసరిగా ఉండాలని ప్రమాదాలు జరిగిన సమయంలో అవి మనకు ఎంతో ఉపయోగకరమని అనుకోని ప్రమాదాలు జరిగినప్పుడు ఇన్సూరెన్స్ లైసెన్స్ వాహన పర్మిట్ అన్ని ఉన్నప్పుడు మన పైన ఎలాంటి భారం పడకుండా హాస్పటల్ పరమైన ఖర్చులు వాహన ఖర్చులు ఇన్సూరెన్స్ కంపెనీ భరిస్తుందని తప్పనిసరిగా భద్రత నియమాలు పాటించాలి ట్రాఫిక్ రూల్స్ పాటించకుండా వాహనాలు నడపడం ద్వారా మీతో పాటు మీ ఎదురుగా వచ్చే వారికి కూడా ఇబ్బందుల కలుగుతాయని తెలుపుతూ అవగాహన కల్పించారు ట్రాఫిక్ రూల్స్ నిబంధనలు పాటిస్తూ కుటుంబంతో సురక్షిత జీవితం గడుపోచ్చని తెలిపారు ఈ కార్యక్రమంలో తూప్రాన్ సిఐ రంగాకృష్ణ ఎస్ఐ గంగరాజు పోలీస్ సిబ్బంది గ్రామ ప్రజలు పాల్గొన్నారు

# రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రభుత్వం కృషి !

## ప్రజల భాగస్వామ్యం కీలకం

## రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్



**సంగారెడ్డి, ఏప్రిల్ 14(సిరి న్యూస్):**

జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. సంగారెడ్డి జిల్లా కంది మండల కేంద్రంలోని ఐఐటీ ప్రాంగణంలో రవాణా శాఖ, రోడ్లు భవనాల శాఖల సంయుక్త ఆధ్వర్యంలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా "అరైవ్–అలైవ్" కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా "అరైవ్–అలైవ్", "రహ–వీర్" రోడ్డు భద్రత నిబంధనలకు సంబంధించిన పోస్టర్లను మంత్రి ఆవిష్కరించారు. అనంతరం రోడ్డు భద్రతపై ప్రతిజ్ఞను ఎంపీ రఘునందన్ రావు అందరితో చేయించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలోని 99 రోజుల కార్యాచరణలో భాగంగా ఈనెల 13 నుండి 18 వరకు రాష్ట్రవ్యాప్తంగా రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం చేపట్టే ప్రతి కార్యక్రమం విజయవంతం కావాలంటే ప్రజల భాగస్వామ్యం తప్పనిసరి అని ఆయన అన్నారు. ప్రమాదాలకు కారణమయ్యే బ్లాక్ స్పాట్స్‌ను గుర్తించి తక్షణ చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు. ప్రమాదాల్లో గాయపడిన వారికి సాయం చేసే వారికి ప్రోత్సాహకాలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. మెదక్ ఎంపీ రఘునందన్ రావు మాట్లాడుతూ దేశంలో ప్రతి సంవత్సరం సుమారు 1.8 లక్షల మంది రోడ్డు ప్రమాదాల్లో మరణించడం ఆందోళనకరమని, ప్రతి నిమిషం ఎక్కడో ఒకచోట ప్రమాదం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రమాద సమయంలో వీడియోలు తీయడం కాకుండా బాధితులను ఆసుపత్రికి తరలించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని సూచించారు.స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్ రాజ్ మాట్లాడుతూ రోడ్డు నిబంధనలు పాటించకపోవడమే ప్రమాదాలకు ప్రధాన కారణమని, చిన్నప్పటి నుంచే వాటిపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు.టి.జి.ఎస్.ఆర్.టి.సి ఎండి నాగిరెడ్డి మాట్లాడుతూ సంస్థకు చెందిన 10,081 బస్సులతో దేశంలో మూడవ అతిపెద్ద రవాణా సంస్థగా నిలిచి, రోజుకు 6 లక్షల మంది ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రావీణ్య, టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మల జయప్రకాష్ రెడ్డి, నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి, ఎమ్మెల్సీ అంజిరెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంజయ్య, టీజీఎస్ఆర్టీసీ కమిషనర్ ఇల్లంబర్తి, జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, ఐఐటీ డైరెక్టర్ మూర్తి, అదనపు కలెక్టర్ పాండు, డిప్యూటీ ట్రాన్స్పోర్ట్ కమిషనర్ వెంకటరమణ, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఊదలతో ఉబకాయం దూరం..!

భారతదేశంలో చిరు ధాన్యాలను తరచుగా ఉపయోగిస్తారు. చిరుధాన్యాలలో అనేక పోషకాలు నిండి ఉంటాయి. అవి ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. అందులో ఊదలు కూడా ఒకటి. పురాతన కాలం నుండి ఊదలు ఆహారంగా, ఔషధంగా ఉపయోగించబడుతున్నాయి. వీటిలో ఫైబర్, ప్రొటీన్లు, కాల్షియం, ఐరన్, ఫాస్పరస్, మెగ్నీషియం పుష్కలంగా ఉంటాయి. అన్నం, కిచిడీ, దోసె, ఇడ్లీ ఇలా రకరకాలుగా ఊదలతో చేసుకుని తినవచ్చు.. ఇవి ఆరోగ్యానికి ఎంతో మేలు చేసే పౌష్టికాహారం. ఉదయాన్నే ఖాళీ కడుపుతో ఊదలు తినడం చాలా మంచిది. వాటిని నేరుగా తినకుండా పాలు, స్మూతీస్ లేదా స్వీట్లతో కలుపుకోవచ్చు. గుండె జబ్బులు ఉన్నవారు వీటిని పరిమిత పరిమాణంలో తినాలి. ఊదలలో క్యాలరీలు తక్కువగానూ, పీచుపదార్థాలు ఎక్కువగానూ ఉండటం వల్ల కడుపు నిండిన అనుభూతిని కలిగిస్తుంది. ఇది ఆకలిని తగ్గిస్తుంది మరియు బరువు నియంత్రణలో సహాయపడుతుంది. ఊదలులో ఫైబర్ పుష్కలంగా ఉంటుంది. ఇది జీర్ణవ్యవస్థను మెరుగుపరచడంలో సహాయపడుతుంది. మలబద్ధకం వంటి సమస్యలు రాకుండా ఉండాలంటే రోజు ఊదలు తినడం మంచిది. ఊదలు గ్లూటెన్ రహిత ఆహారం. అందువల్ల, గ్లూటెన్ అలెర్జీ ఉన్నవారు కూడా వాటిని తినవచ్చు. ఊదలలోని విటమిన్ సి, విటమిన్ డి చర్మాన్ని ఆరోగ్యంగా, పోషణతో ఉంచడంలో సహాయపడతాయి. ఇది చర్మాన్ని ముడతలు పడకుండా చేసి చర్మం యవ్వనంగా కనిపించేలా చేస్తాయి. ఊదలు తినడం వల్ల మూత్రాశయ నియంత్రణకు, పిత్తాశయ రాళ్లను తొలగించడానికే కాకుండా.. కొన్ని రకాల జ్వరాలకు చికిత్స చేయడానికి కూడా సహాయపడుతుందని కొన్ని అధ్యయనాలు సూచిస్తున్నాయి. ఊదలు తక్కువ గ్లైసెమిక్ సూచికను కలిగి ఉంటుంది. ఇది రక్తంలో చక్కెర స్థాయిలను నెమ్మదిగా పెంచుతుంది. మధుమేహం ఉన్నవారికి లేదా మధుమేహం వచ్చే ప్రమాదం ఉన్నవారికి ఇది చాలా ఉపయోగకరంగా ఉంటుంది. గర్భిణీ స్త్రీలు పాలకూర తింటే చాలా మేలు జరుగుతుంది. అవి పుట్టబోయే బిడ్డ అభివృద్ధికి అవసరమైన ఇనుమును అందిస్తాయి. ప్రసవ సమయంలో ఉపశమనాన్ని అందించడానికి ఊదలు సహాయపడుతుందని పరిశోధనలు కూడా చెబుతున్నాయి. ఊదలు గుండె ఆరోగ్యానికి చాలా మంచిది. ఇవి రక్తపోటును నియంత్రించడంలో సహాయపడతాయి. ఇవి కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గిస్తాయి మరియు గుండె సంబంధిత రుగ్మతల ప్రమాదాన్ని తగ్గిస్తాయి. ఊదలలో యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి శరీరంలోని హానికరమైన ఫ్రీ రాడికల్స్‌ని తొలగించి రోగనిరోధక శక్తిని పెంచుతాయి. అందువలన, అవి శరీరాన్ని అనేక వ్యాధుల నుండి రక్షిస్తాయి.




# ఈ లడ్డూ రోజుకు ఒకటి తింటే చాలు



ప్రస్తుత పరుగుల ప్రపంచంలో పోషకాహార లోపం అతి పెద్ద సమస్యగా మారుతుంది. పని ఒత్తిడి వల్లో, సమయం లేకనో చాలా మంది రెడి టు ఈట్ ఆహారం వైపు, ఫాస్ట్ ఫుడ్ వైపు అడుగులు వేస్తున్నారు. అవి తినడం వల్ల ఆ కాసేపు నోటికి రుచికరంగా, ఆ క్షణానికి తినాలి అన్న పని ముగుస్తుంది. కానీ మనకు ఆరోగ్య పరంగా ఎటువంటి మేలు ఉండదు. పైగా అనారోగ్య కారకాలు అధికమైపోతాయి. ఈ విషయం అందరికీ తెలుసుకు. కానీ పని ఒత్తిడి బాస్.. ఫుడ్ ప్రిపేర్ చేసుకునే సమయం లేకనే ఇలా చేస్తున్నాం. లేకపోతే ఈ ఫుడ్ తినడం మాకు మాత్రం ఇష్టామా ఏంటి అని సమాధానం చెప్తారు. అయితే ఇకపై హెల్తీ ఫుడ్ కోసం వంటగదుల్లో ప్రతి రోజూ యుద్ధాలు చేయాల్సిన అవసరం లేదని ఆరోగ్య నిపుణులు అంటున్నారు. పిజ్జాలు, బర్గర్, ఫ్రైడ్ రైస్‌లు వంటి జంక్ తినడం వల్ల ఏర్పడిన పోషకాల లోపాలను రోజుకు ఒక్క లడ్డూ తినడం ద్వారా తగ్గించుకుకోవచ్చంటున్నారు. ఈ లడ్డూ ప్రతి రోజూ ఒకటి తింటే ఎటువంటి పోషకాహార లోపాలు ఉన్నా తగ్గుతాయని, వాటి వల్లు వచ్చేర సమస్యలు కూడా దూరమవుతాయని నిపునులు అంటున్నారు. అవే మల్టీసీడ్స్ లడ్డూలు. మరి వీటి రెసిపీ ఏంటో తెలుసా.. రండి చూసేద్దాం.

## కావలసిన పదార్థాలు

అవిసె గింజలు రెండు స్పూన్లు
గుమ్మడి గింజలు రెండు స్పూన్లు
సన్ ఫ్లవర్ సీడ్స్ రెండు స్పూన్లు
నువ్వులు రెండు స్పూన్లు
ఓట్స్ పావు కప్పు
ఖర్జూరాలు పది
యాలకుల పొడి చిటికెడు
నెయ్యి ఒక స్పూను

## మల్టీ సీడ్స్ లడ్డూ రెసిపీ

1. స్టవ్ మీద కళాయి పెట్టి అవిసె గింజలు, గుమ్మడి గింజలు, పొద్దు తిరుగుడు గింజలు, నువ్వులు, ఓట్స్ వంటివన్నీ కూడా వేయించుకొని మిక్సీలో వేసి మెత్తగా పొడి చేసుకోవాలి.
2. స్టవ్ మీద కళాయి పెట్టి ఒక స్పూన్ నెయ్యిని వేయాలి.
3. ఆ నెయ్యిలో ఖర్జూరాలను సన్నగా తరిగి వేయించుకోవాలి.
4. ఆ ఖర్జూరం మిశ్రమంలోనే ముందుగా రుబ్బి పెట్టుకున్న పొడిని కూడా వేసి బాగా కలపాలి.
5. అలాగే యాలకుల పొడిని కూడా వేయాలి.
6. ఈ మొత్తం మిశ్రమాన్ని స్టవ్ ఆఫ్ చేసి మొత్తం మిశ్రమాన్ని చల్లార్చాలి.
7. ఇప్పుడు ఈ మిశ్రమంలో అవసరమైతే కొంచెం నెయ్యిని వేసుకొని లడ్డూల్లా చుట్టుకోవాలి.
8. అంతే టేస్టీ మల్టీ సీడ్స్ లడ్డు రెడీ అయినట్టే.
9. వీటిని సీసాలో ఉంచి మూత పెట్టాలి. ప్రతిరోజూ ఒకటి తింటే చాలు, మీ శరీరానికి కావలసిన పోషకాలు అందుతాయి.

## వీటి వల్ల కలిగే ప్రయోజనాలు

మల్టీ సీడ్స్ లడ్డు రెసిపీలో మనం అవిస గింజలను వాడాము. ఇందులో చెడు కొలెస్ట్రాల్ ను తగ్గించి మంచి కొలెస్ట్రాల్ ను పెంచే గుణాలు ఉన్నాయి. అవిసె గింజలను ప్రతిరోజూ ఆహారంలో భాగం చేసుకోమని కూడా చెబుతారు. ఇవి జీర్ణ క్రియను మెరుగుపరుస్తాయి. క్యాన్సర్ తో పోరాడుతాయి. మధుమేహాన్ని నియంత్రిస్తాయి. రక్తపోటును కూడా అదుపులో ఉంచుతాయి. చర్మాన్ని మెరిసేలా చేస్తాయి. అలాగే ఖర్జూరాన్ని కూడా ఎక్కువగానే వినియోగించాము. ఈ ఖర్జూరంలో కాల్షియం, ఐరన్, పొటాషియం, మెగ్నీషియం, ప్రోటీన్, ఫైబర్, విటమిన్స్ వంటివి పుష్కలంగా ఉంటాయి.
ఖర్జూరంలో ఇనుము కంటెంట్ అధికంగా ఉంటుంది. కాబట్టి రక్తహీనత సమస్యతో బాధపడుతున్న వారు ఖర్జురాన్ని ఆహారంలో భాగం చేసుకుంటే ఉత్తమం.



ప్రతిరోజూ రెండు ఖర్జూరాలు తినడం వల్ల ఆరోగ్యానికి ఎంతో మేలు జరుగుతుందని పోషకాహార నిపుణులు కూడా చెబుతున్నారు. అలాగే గుమ్మడి గింజలు, సన్ ఫ్లవర్ సీడ్స్, నువ్వుల్లో కూడా ఆరోగ్యానికి కావాల్సిన ఎన్నో విటమిన్లు, ఖనిజాలు ఉంటాయి. ఇవన్నీ కూడా మనకు పోషకాహార లోపం లేకుండా చేస్తాయి. కాబట్టి మల్టీ సీడ్స్ లడ్డును కచ్చితంగా మహిళలు పిల్లలు తినేందుకు ప్రయత్నించాలి.



The imprint line should be printed legibly as Printed by Published by BADHE JAYASHREE on behalf of BADHE JAYASHREE, printed at and published at PLOT NO. 104, KAPIL KAUSALYA APARTMENT, SHILPA CERENY COUNTY VENCHER, POTHIREDDYPALLY editor BADHE JAYASHREE.